నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
1
సోమవారం | 08 జులై 2024 | www.navatelangana.com

తల్లి మరణంతో మనోవేదన..పురుగుల మందు తాగి కొడుకు మృతి



నవతెలంగాణ-మర్కుక్

తల్లి మరణంతో మనోవేదనకు గురై కొడుకు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామంలో చోటుచేసుకుంది. మర్కుక్ ఎస్ఐ చల్ల కథనం ప్రకారం ఎర్రవల్లి గ్రామానికి చెందిన మల్లని సర్పమ్మ(60) కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ గత మూడు నెలల క్రితం మృతి చెందారు. తల్లి మృతిని జీర్ణించుకోలేక కొడుకు మనోవేదనతో బాలమల్లు (36) శనివారం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే గజ్వేల్‌లోని జిల్లా ఆస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందాడు. తండ్రి నర్సయ్య తన కొడుకు బాలమల్లు తల్లి మల్లమ్మ మృతిని తట్టుకోలేకనే మనోవేదనకు గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. తన కొడుకు మరణంపై తమ ఎలాంటి అనుమానం లేదని ఫిర్యాదు మేరకు మర్కుక్ ఎస్సై మధుకర్ రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మృతుడికి భార్య బాలమణి, ముగ్గురు కొడుకులు పరాక్, నందు, భానులున్నారు.

ట్రాక్టర్ కేజ్ వీల్స్‌తో రోడ్లపైకి వస్తే చర్యలు తీసుకుంటాం



సీపీ. డాక్టర్ బి. అనురాధ

నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

ట్రాక్టర్ కేజ్ వీల్స్‌తో రోడ్లపైకి వస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సీపీ. డాక్టర్ బి. అనురాధ అన్నారు. ట్రాక్టర్‌లను కేజ్ వీల్స్‌తో బీటీ రోడ్లు, సీసీ రోడ్లపై నడపడం వల్ల రోడ్లు డ్యామేజి అవుతాయని, అలా ట్రాక్టర్‌లను కేజ్ వీల్స్ తో బీటీ రోడ్లు, సీసీ రోడ్లపై నడిపే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం ఎంతో వ్యయంతో ప్రజలకు మెరుగైన సుఖవంతమైన ప్రయాణం కోసం రోడ్లను ఏర్పాటు చేసిందని కొందరు ట్రాక్టర్ యజమానులు పొలాల్లో పని చేయడానికి కేజ్ వీల్స్‌ను రోడ్లపై ఉపయోగించడం వల్ల రోడ్లు ధ్వంసం అవుతున్నాయని, కాబట్టి ట్రాక్టర్ యజమానులు పొలాల్లో పనుల నిమిత్తం వెళ్ళేటప్పుడు తమ ట్రాక్టర్లను కేజ్ వీల్స్‌తో రోడ్డుపై నడపవద్దన్నారు. అలా నడపడం వల్ల రోడ్డు డ్యామేజై రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నదన్నారు.

విద్యార్థుల ప్రతిభను గుర్తించడమే ఇష్టా విద్యాసంస్థల లక్ష్యం

ఐఐటీ రామయ్య ఇష్టా విద్యాసంస్థల చైర్మన్ కోటా కార్తీక్
పటేల్ గూడ ఇష్టా విద్యాలయంలో ఘనంగా ఫ్రెషర్స్ డే
ఆటపాటలతో ఆకట్టుకున్న విద్యార్థులు





నవతెలంగాణ-పటాన్ చెరు

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వారిని మెరుగు పర్చడమే ఐఐటి రామయ్య ఇష్టా విద్యాసంస్థల ధ్యేయమని ఆ సంస్థల చైర్మన్ కోటా కార్తీక్ అన్నారు. ఆదివారం పటేల్ గూడలోని ఐఐటి రామయ్య ఇష్టా విద్యాలయంలో ఘనంగా ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఇష్టా గ్రూప్ చైర్మన్ కార్తీక్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఇష్టా కళాశాలలో చేరిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను గుర్తించి, వారి ప్రతిభకు తగ్గట్టు వారిని ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల ప్రోత్సాహంతో తమ కళాశాలలో విద్యార్థులకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తూ వారిని అన్ని రంగాలలో రాణించే విధంగా తీర్చి దిద్దుతున్నట్లు చెప్పారు. తమ కళాశాలలో చదువుతోపాటు ఇతర రంగాలలోనూ విద్యార్థులను ప్రోత్సహిస్తామన్నారు. విద్యార్థి తమ కళాశాలకు చిన్నప్పటి నుంచి చదువుతోపాటు ఆటపాటలు శారీరక వ్యాయామం ఇతర కార్యక్రమాలలో నిష్టాతులను చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉపధ్యాయులతో విద్యార్థులను అన్ని రంగాలలో రాణించే విధంగా వారికి మెలకువలను నేర్పుతామన్నారు. ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులను ఆయన అభినందించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. మొదటి సంవత్సరం ద్వితీయ సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులను ఆయన ఈ సందర్భంగా అభినందించారు. శాలువాతో సత్కరించి బహుమతి ప్రధానం చేశారు. తమ కళాశాల ప్రారంభించి నాలుగు సంవత్సరాలలో వివిధ బ్రాంచ్‌లను ఏర్పాటు చేసుకోవడం జరిగిందని తమ కళాశాలకు ఇంత గుర్తింపు తెచ్చిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. తల్లిదండ్రులు తమ కళాశాల మీద పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యార్థులను అన్ని రంగాలలో తీర్చిదిద్దాతామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమ్ కుమార్, ఇష్టా విద్యాసంస్థల డైరెక్టర్ వినోద్, కళాశాల యజమాన్యం సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యాంత్రీకరణ జాడేది

- రాష్ట్రీయ కృషీ వికాస్ యోజన, జాతీయ ఆహార భద్రతా మిషన్... పథకాల అమలు పట్టని ప్రభుత్వాలు
- ఆగిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం
- సాగులో పెరుగుతున్న యంత్రాల వినియోగం
- విత్తనాలు, ఎరువుల సబ్సిడీకీ కోత







నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

వ్యవసాయ సబ్సిడీలకు కోత పెడుతూ వస్తున్నారు. యాంత్రీకరణ, ఎన్ఎఫ్ఎస్ఎం, ఆర్‌కేవీవై వంటి పథకాలకు మంగళం పలికారు. విత్తనాలు, ఎరువుల సబ్సిడీలకు కూడా కోత పెడుతున్నారు. వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ పెరిగి పనిముట్ల వినియోగం అనివార్యమైంది. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ సబ్సిడీలను పెంచాల్సింది పోయి కోత పెడుతూ వస్తున్నాయి. గత ప్రభుత్వం యాంత్రీకరణ పథకానికి నిధులివ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా యాంత్రీకరణ పథకాన్ని అమలు చేయాలని రైతులు కోరుతున్నారు. అన్ని రకాల విత్తనాలనూ సబ్సిడీపై పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పెరిగే ధరల వల్ల సాగు ఖర్చులు భారమై రైతులు నష్టపోతున్నారు.

వ్యవసాయ యాంత్రీకరణ పథకాలు

వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక పద్ధతుల్ని అనుసరించడం ఆనివార్యమవుతోంది. యంత్రాల వినియోగం రోజు రోజుకూ పెరుగుతోంది. నీటి తోడకం, పారుదల, పొలం దున్నకం, చదును చేయడం, విత్తు విత్తడం, నాట్లు వేయడం, సాళ్ల తోలడం, కలుపు తీయడం, కందకాలు పోయడం, పురుగు మందులు పిచికారి చేయడం, కోతలు కోయడం ఇలా వ్యవసాయంలో ప్రతి పనికీ యంత్రాలు, పనిముట్లపైనే ఆధారపడాల్సి వస్తుంది. అందుకే ట్రాక్టర్లు, మినీ ట్రాక్టర్లు, రోటోవేటర్లు, కల్టివేటర్లు, పొలం దున్నే పనిముట్లు నాగళ్లు, గొర్రు, విత్తన గొర్రు, పవర్ స్ప్రేయర్లు, చేతిపంపులు, డ్రిప్‌పైపులు, నీటి సరఫరా పైపులు, పంపుసెట్లు, టార్పాలిన్లు, కూరగాయల సాగులో కవర్లు ఇలా యంత్రపనిముట్లను సబ్సిడీపై ఇచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని పథకాల్ని ప్రారంభించాయి. కేంద్ర ప్రభుత్వం వంద శాతం నిధులతో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో జాతీయ ఆహార భద్రతా మిషన్, వ్యవసాయ యాంత్రీకరణ వంటి పథకాల్ని అమలు చేశారు. యంత్రాలు, పనిముట్ల ధరల్ని బట్టి దరఖాస్తు చేసుకున్న రైతులకు 50 శాతం సబ్సిడీ లేదంటే నిర్ణీత రాయితీని అందజేశారు. దీంతో స్వతహాగా యంత్రాలు, పనిముట్లను కొనుగోలు చేసేందుకు ఆర్థిక స్థోమతలేని రైతులు రాయితీ పథకాల ద్వారా సమకూర్చుకునేది. తద్వారా వ్యవసాయంలో ఎంతో ఉపయోగం చేకూరేది.

ఎన్ఎఫ్ఎస్ఎం, ఆర్‌కేవీవై పథకాల జాడేది

వ్యవసాయ అభివృద్ధిలో ప్రాంతీయ అసమానతల్ని తొలగించాలని, వ్యవసాయ, అనుబంధ రంగంలో పునర్జీవం పోయాలని, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంపొందించాలని, బియ్యం, గోదుమలు, పప్పుధాన్యాలు, తృణధాన్యాల ఉత్పత్తిని పెంచాలనే లక్ష్యాలతో కేంద్ర ప్రభుత్వం కొన్ని పథకాల్ని ప్రవేశపెట్టింది. 2007లో జాతీయ ఆహార భద్రతా మిషన్ (ఎన్ఎఫ్ఎస్ఎం), రాష్ట్రీయ కృషీ వికాస్ యోజన (ఆర్‌కేవీవై) పథకాల్ని ప్రారంభించారు. జాతీయ ఆహార భద్రతా మిషన్ పథకం కింద బియ్యం, గోదుమలు, పప్పుధాన్యాలు, ముతక తృణధాన్యాల ఉత్పత్తుల్ని పెంచేందుకు కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం వాటాతో పథకాన్ని అమలు చేసేది. సబ్సిడీపై యంత్ర పరికరాల్ని అందజేశారు. ముఖ్యంగా వరి సాగులో డ్రమ్‌సీడర్ ద్వారా వరిని సాగు చేయడంతో పాటు సాగు కోసం కావాల్సిన పవర్ ఆపరేటర్ స్ప్రేయర్ 12-16 లీటర్లు, ఆ పైన కేపాసిటీ పవర్ స్ప్రేయర్లను 50 శాతం సబ్సిడీతో లేదంటే రూ.3800 నుంచి పది వేల రాయితీ ఇచ్చేది. సీడ్ డ్రీల్‌కు 50 శాతం సబ్సిడీ లేదా రూ.44 వేల రాయితీ, పవర్ వీడర్‌కు 50 శాతం సబ్సిడీ లేదంటే రూ.19 వేల రాయితీ, రోటోవేటర్లకు 50 శాతం లేదంటే రూ.63 వేల రాయితీ ఇచ్చేది. పంపుసెట్లకు రూ.10 వేలు, నీటి పైపులకు రూ.15 వేల రాయితీ వచ్చేది. కంది, పెసర, శనగ సాగులో మినీ ధాల్‌మిల్ కోసం రూ.2 లక్షల రాయితీ ఇచ్చేది. రాష్ట్రీయ కృషీ వికాస్ యోజన పథకం ద్వారా కూడా వ్యవసాయ ఇన్‌పుట్స్, మౌళిక సదుపాయాల అభివృద్ధి, పరిశోధన, విస్తరణ కోసం రాయితీ ఇస్తారు. అదే విధంగా వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా ట్రాక్టర్లు, మినీ ట్రాక్టర్లు, కల్టివేటర్లు, నాగళ్లు, గొర్రు, డ్రిప్‌పైపులు, టార్పాలిన్లు 50 శాతం సబ్సిడీపై రైతులకు ఇచ్చేది. ఈ మూడు రకాల పథకాలు కూడా అందట్లేదు.

విత్తన, ఎరువుల సబ్సిడీల్లోనూ కోతలు



వ్యవసాయాభివృద్ధిలో రైతులకు తగిన ప్రోత్సహకాలు అందించాలని స్వామినాథన్ కమిషన్ సూచించింది. కొంత మేరకు విత్తనాలు, ఎరువుల రాయితీలు కొనసాగాయి. క్రమంగా సబ్సిడీలకు కోత పడుతోంది. జాతీయ ఆహార భద్రత మిషన్ కింద పప్పు ధాన్యాల ఉత్పత్తుల్ని పెంచేందుకు రైతులకు కంది, పెసర, శనగ, మినుము విత్తనాలను సబ్సిడీపై అందజేసేది. విత్తన ధరలో 50 శాతం సబ్సిడీ వర్తించేది. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వరి విత్తనాలపైన కూడా సబ్సిడీ ఇచ్చేది. ప్రస్తుతం సోయాబీన్ విత్తనాలనే సబ్సిడీపై ఇస్తున్నారు. అలాగే భూములో నత్రజని శాతం తగ్గకుండా ఉండేందుకు జింక్ సల్ఫేట్ ఎరువును రైతులకు సగం ధరకే రాయితీపై అందజేసేది. జింక్ ఇవ్వడమే మానేశారు. యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులపైన కూడా కేంద్రం సబ్సిడీల్లో కోత పెడుతుండడంతో వాటి ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి.

సబ్సిడీలపై యంత్రాలు, పరికరాలివ్వాలి: రాజయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు

గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీపై యంత్రాలు, పరికరాల్ని అందజేసేది. ప్రస్తుతం ఆ పథకాలకు నిధుల్లేక అమలు చేయట్లేదు. వ్యవసాయంలో యంత్రాలు, పనిముట్ల వినియోగం బాగా పెరిగింది. వాటిని రైతులు కొనుగోలు చేయడం కష్టం. యంత్రాల అద్దెలు కూడా బాగా పెరిగాయి. రైతుల సంక్షేమ ప్రభుత్వం అని చెప్పుకునే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఖరీఫ్ సీజన్ నుంచే యాంత్రీకరణ పథకాల్ని అమలు చేయాలి.

సబ్సిడీ పథకాలు వస్తే అమలు చేస్తం :

అంబికా సోనీ, జిల్లా వ్యవసాయాధికారి

ప్రభుత్వం మార్గదర్శకాలను బట్టి సబ్సిడీ పథకాలు అమలు చేయబడతాయి. ప్రస్తుతం యంత్రాలు, పనిముట్లకు సంబంధించి సబ్సిడీ పథకాల్లేవి అమలు కావట్లేదు. గతంలో యాంత్రీకరణ, ఎన్ఎఫ్ఎస్ఎం, ఆర్‌కేవీవై వంటి పథకాల కింద యంత్రాలు, పనిముట్లను సబ్సిడీపై రైతులకు ఇచ్చేది. ప్రస్తుతం సబ్సిడీపై యంత్రాలిచ్చే పథకాలు అమలుకావడంలేదు.

ఓడిపోయినందుకు బాధ లేదు..

- మీరు బాధపడకండి..
- ఎల్లవేళలా ప్రజా సంక్షేమానికే కృషి చేస్తా
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి
- ఘనంగా జన్మదిన వేడుకలు





నవతెలంగాణ-సంగారెడ్డి

'సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలు తనను ఎమ్మెల్యేగా ఓడించిన తరువాత ప్రశాంతంగా ఉన్నానన్నారు. దేవుడిపై ప్రమాణం చేసి చెబుతున్నా ఓడిపోయినందుకు నాకు ఎలాం టి బాధ లేదు.. ఓడగొట్టామని మీరు కూడా ఫీల్ కావద్దు, నేను మనస్ఫూర్తిగా, దైవసాక్షిగా చెబుతున్నా ప్రశాంతంగా ఉన్నాను' అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. జగ్గారెడ్డి, ఆయన కుమా ర్తె జయారెడ్డి(కూచి) పుట్టినరోజు వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పోతిరెడ్డిపల్లి నుంచి సంగారెడ్డిలోని మదీన వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ సంద ర్భంగా పోతిరెడ్డిపల్లి చౌరస్తా, సీఎస్ఐ చర్చి, నాల్సాబ్ గడ్డ లోని మదీన వద్ద కేక్ కట్ చేసి సంబురాలు జరిపారు. ర్యాలీ లో కార్యకర్తలు జగ్గారెడ్డితో సెల్ఫీలకు పోటీ పడ్డారు. అదే విధంగా దారి వెంట జగ్గారెడ్డిని గజమాలల, శాలువాలతో సన్మానించారు. పట్టణమంతా ఫ్లెక్సీలతో నింపేశారు. డీజే సౌండ్లతో, బాణాసంచా మోతలతో ర్యాలీ నిర్వహించారు. సంగారెడ్డి ఐబీలో కేక్ కట్ చేసిన అనంతరం జగ్గారెడ్డి మాట్లాడుతూ.. తాను ఓడిపోయినా.. బాధేమీ లేకుండా ప్రశాంతంగా ఉన్నానన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది కాబట్టి అభివృద్ధి విషయంలో జవాబుదారిగా ఉంటా నన్నారు. ప్రజలకు ఏమేమి కావాలో చేసిపెడతానని హామీ ఇచ్చారు. అదే విధంగా రెండు నెలల వరకు కార్యకర్తలు హైదరాబాద్ రావొద్దని, గాంధీభవన్‌కు పార్టీ కార్యక్రమాలకు మాత్రమే పోతానన్నారు. అక్కడ ఎవ్వరిని కలవనని, అందు వల్ల రావొద్దని కార్యకర్తలకు సూచించారు. తాను రెండు నెలల తరువాత ప్రతీ సోమవారం సంగారెడ్డిలోనే ఉంటాన ని, రెండు నెలల వరకు తన వద్దకు ఎవ్వరూ రావొద్దన్నారు. పైసలు సంపాదిస్తా.. ప్రజలకు పంచిపెడతా.. సొంత ఆస్తి ఏమీలేదు.. తన భార్యకు బంగారు నెక్లెస్ కూడా చేయించ లేదన్నారు. తాను మొత్తం అప్పుల్లోనే ఉన్నానన్నారు. దసరా పండుగకు ప్రతీయేడు రూ.2 కోట్లు ఖర్చు పెడుతు న్నామని.. శ్రీరామ నవమికి రూ.60 లక్షలు, అన్ని పండు గలకు కలిపి రూ.20 కోట్లు ఖర్చు అవుతుందన్నారు. కార్యక ర్తలు నాయకులు తన మొహంలో ఆనందం చూస్తున్నారు కానీ తన లోపల అగ్ని రగులుతుందన్నారు. ఇతర పార్టీల వారు మనజోలికి రారు.. మనము వారి జోలికి పోవద్దని సూచించారు. సంగారెడ్డి నియోజకవర్గంలో లా అండ్ ఆర్డర్ సమస్య రావొద్దని పోలీసులకు సహకరించాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఐఐడీసీ చైర్మన్ నిర్మలా జగ్గా రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తోపాజీ అనంతకిషన్, చెర్యాల ఆంజనేయులు, జార్జీ, కూన సంతోష్ కుమార్, మహేష్, శ్రీకాంత్ గౌడ్, షేక్ షఫీ, కిరణ్ గౌడ్, గంగేరి శ్రీహరి, బుచ్చి రాములు, బొంగుల విజయలక్ష్మి రవి, సుధాకర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

భూమి పంచాలి.. కూలి పెంచాలి

- ఉపాధి హామీని సక్రమంగా అమలు చేయాలి
- వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.నర్సిములు



నవతెలంగాణ-సంగారెడ్డి

భూమి లేని నిరుపేదలకు ప్రభుత్వ భూమిని పంచా లని, ఉపాధి హామీ కూలి పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.నర్సిములు డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.నర్సిములు మాట్లాడ ుతూ.. సంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంత మవుతున్నా ప్రభుత్వా అధికారులు పట్టించుకోవడం లేదన్నా రు. పేదలు ఇండ్ల స్థలాలు లేక కిరాయిలు చెల్లించలేక సతమతమవుతున్నారన్నారు. ప్రభుత్వ యంత్రాంగం సమగ్ర సర్వే నిర్వహించి భూములు కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకుని.. అర్హులైన పేదవారికి ఇళ్ల స్థలాలు ఇవ్వా లని కోరారు. ప్రభుత్వ హామీ ప్రకారం రూ.5 లక్షలు ఇచ్చి ఇండ్ల నిర్మాణాలను చేపట్టాలని డిమాండ్ చేశారు. పార్టీల కార్యాలయాలకు, పార్టీ నాయకులు ఎకరాల కొద్ది కబ్జా చేస్తున్న అధికారులకు కనిపించదని.. పేదలు 100 గజాల ఇంటి నిర్మాణం కోసం గుడిసెలు వేసుకుంటే ఖర్కశంగా పీకే యడం ఎంతవరకు న్యాయమన్నారు. పేదలకో న్యాయం.. పెద్దలకో న్యాయంగా వ్యవహరించొద్దన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న కంది, సంగారెడ్డి, సదాశి వపేట, కొండాపూర్‌తో పాటు జిల్లాలో అనేక మండలాల్లో ప్రభుత్వ భూములను కబ్జా చేసి రేకుల షెడ్లు నిర్మించి మరియు ప్లాట్లుగా చేసి అమ్ముతున్న నాయకులపై ప్రభుత్వ యంత్రాంగం కొరడా జులిపించాలని విజ్ఞప్తి చేశారు. వ్యవ సాయ కార్మికులకు కనీస వేతన చట్టాలు ఉన్నప్పటికీ ప్రభు త్వం, ప్రభుత్వ యంత్రాంగం ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రచారం చేయడం లేదన్నారు. ధరలు పెరిగినప్పుడల్లా కూలి పెంచాలన్నారు. కూలీలకు ప్రభుత్వం ఇస్తామన్న రూ.12 వేలు వెంటనే అమలు చేయాలన్నారు. ప్రభుత్వమిచ్చిన 6 గ్యారంటీలను వెంటనే అమలు చేయాలన్నారు. రాబోయే రోజుల్లో వ్యవసాయ కార్మిక సంఘం.. కూలి, భూమి, ఉపాధి పోరాటాలతో పాటు ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారెంటీ లపై పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టి.ఏషోబు, చంద్ర న్న, కుమార్, జి.రాజు, గోపాల్, రాజు ప్రభాకర్ శేఖర్ నరసింహులు దాసు, తుల్జారాం తదితరులు పాల్గొన్నారు.

దళితుల హక్కుల సాధనకు పోరాటాలే మార్గం



నవతెలంగాణ-సంగారెడ్డి

దళితుల హక్కుల సాధన కోసం పోరాటాలు తప్ప మరొక మార్గం లేదని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్ అన్నారు. కులవక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కేవల్ కిషన్ భవన్‌లో రెండ్రోలపాటు జరిగిన సామా జిక ఉద్యమ శిక్షణా తరగతులు ఆదివారం ముగిసాయి. ఈ సందర్భంగా మాణిక్ మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా దళితులపై పెద్ద ఎత్తున దాడులు జరుగుతూనే ఉన్నాయ న్నారు. దాడులు చేస్తున్న వారి పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లు మెతక వైఖరి అవలంబిస్తున్నాయన్నారు. రక్షణ చట్టాలు ఉన్నా అగ్రకుల పెత్తందారులకు చుట్టాలుగా మారుతు న్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దళితుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు తప్ప మరొక మార్గం లేదని అన్నారు. రాబోవు కాలంలో రాజ్యాంగ రక్షణ కోసం రిజర్వేష న్లు అమలు కోసం, విద్యా, వైద్యం కోసం ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు కోసం పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమ ంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పి.అశోక్ జిల్లా ఉపాధ్యక్షులు శివకుమార్, రాజు, సుభాష్, జిల్లా సహాయ కార్యదర్శులు మల్లేశం, ప్రవీణ్, దాసు, సంతోష్ జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర్, జయకుమార్, జయరాం, గంగారం నాయ కులు పెంటయ్య, నాగరాజు, దివాకర్, ఆనంద్, దాసు తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆదాయాన్ని పెంచడానికి చర్యలు తీసుకోవాలి

- పంటలకు కేంద్రం మద్దతు ధరలివ్వాలి
- వానకాలం పంట రుణాలు వెంటనే ఇవ్వాలి
- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్



నవతెలంగాణ-సంగారెడ్డి

వ్యవసాయ సంక్షోభాన్ని తిప్పికొట్టడానికి, వ్యవసాయ రంగ పునరాభివృద్ధికి కృషి చేస్తున్న రైతుల ఆదాయాన్ని పెంచడానికి నిర్దిష్ట చర్యలను తీసుకోవాలని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ కోరారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో జిల్లా ఉపా ధ్యక్షులు నరసింహ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా శోభన్ హాజరై మాట్లా డుతూ.. కనీస మద్దతు ధరలకు చట్టబద్ధ హామీని ఇస్తూ.. సమగ్ర ఉత్పత్తి ఖర్చు సి2కు కనీసం 50 శాతం కలిపి మద్ద తు ధరకు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. మద్దతు ధరలు అమలయ్యే వ్యవస్థను ఇతర పంటలకు విస్తరిం చాలని, అన్ని రాష్ట్రాల్లో మద్దతు ధరలకు సేకరించి, దేశంలో వ్యవసాయోత్పత్తుల మార్కెట్‌లను పెంచాలన్నారు. విత్తనా లు, ఎరువులు, సస్యరక్షణ మందులు, డీజిల్, నీరు, విద్యుత్ ధరలను బాగా తగ్గించి నియంత్రించాలన్నారు. కార్పొరేట్ కంపెనీల లాబీలను నియం త్రిస్తూ ప్రభుత్వ రాయితీలను పెంచాలన్నారు. వ్యవసాయరంగ పెట్టుబడులను పెంచా లని కోరారు. గ్రామీణ మౌలిక మార్కెట్ సౌకర్యాలు, అన్ని నీటి వనరుల సమగ్ర నీటి యాజమాన్యంమీద కేంద్రీకరిం చాలన్నారు. వ్యవసాయ రాయితీలను పెంచాలని కోరారు. రైతులకిచ్చే అన్ని రాయితీలు, బీమా సౌకర్యం, ఆదాయ మద్దతు లాంటి సౌకర్యాలన్ని కౌలు రైతులకు లభించేలా లైసెన్స్ కార్డులను ఇచ్చే వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరా రు. భూ సేకరణలో న్యాయమైన, పారదర్శకమైన పరిహార హక్కును కల్పించాలని కోరారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు జి.జయరాజు మాట్లాడుతూ.. సాగు చేస్తు న్న రైతులందరికీ రైతు భరోసా అందించాలన్నారు. అన్ని రకాల వడ్లకు బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు భరోసా ఇవ్వాలని కోరారు. సింగూరు కుడి కాలువ ద్వారా రైతులకు సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజయ్య, జిల్లా ఉపాధ్యక్షులు మల్లారెడ్డి, రామాంజనేయ లు, సహాయ కార్యదర్శులు మాణిక్ రెడ్డి, భూషణ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సురభి మెడికల్ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ మెడికల్ కళాశాలని పర్యవేక్షించాలి
ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కమిటీ డిమాండ్



నవతెలంగాణ-సిద్దిపేట : మిట్టపల్లి సురభి మెడికల్ కాలేజీలో ఫుడ్ పాయిజన్ అయిన విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ డిమాండ్ చేశారు. అంతకుముందు సురభి కళాశాలలో వంటశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలను సందర్శించగా అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయన్నారు. కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం లేదన్నారు. విద్యార్థుల దగ్గర ఫీజులు ఒక్కొక్కరికి రూ.1,50,000 వసూలు చేస్తూ కూడా సరైన మౌలిక వసతులు కల్పించడం లేదని ఆరోపించారు. మెడికల్ కాలేజ్ బిల్డింగ్ నిర్మాణం ఇంకా పూర్తి కాలేదన్నారు. భోజన విషయంలో సరైన నాణ్యత లేక అతి తక్కువ ధరకు వచ్చే వంట నూనెను వాడుతున్నారు. థర్డ్ గ్రేడ్ కూరగాయలు నాణ్యత లేని సరుకులు, పాలిష్ చేసిన బియ్యం వాడడం వల్ల విద్యార్థులందరికీ ఫుడ్ పాయిజన్ జరిగింద న్నారు. లక్షలు ఖర్చుపెట్టి చదువుకోవడం కోసం ఇంత దూరం వచ్చినా కూడా సరైన భోజనం, వసతులు, బిల్డింగ్ లేక విద్యార్థులు సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఎక్కువ మెజారిటీ విద్యార్థులు మహారాష్ట్రకు చెందినవారని, కానీ వాళ్లకు కావాల్సినవి చపాతీలు, కానీ అన్నం తింటున్నారన్నారు. వైద్య అధికారులు, జిల్లా కలెక్టర్ మెడికల్ కళాశాలను సందర్శించి, విద్యార్థి సమస్యలు వెంటనే పరిష్కారమయ్యే విధంగా చేయాలని కోరారు. లేనియెడల కళాశాల విద్యార్థులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళన ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా మాజీ అధ్యక్షుడు చొప్పరి రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షులు కొండం సంజు, నాయకులు అభి, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

జిన్నారంలో కోర్టు ఏర్పాటు పట్ల కృతజ్ఞతలు



నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు ప్రక్రియలో భాగంగా సంగారెడ్డి జిల్లా కోర్టు ప్రధాన న్యాయ మూర్తి భవాని చంద్ర భవన పరిశీలన కార్యక్రమాన్ని నిర్వహించడం, సానుకూలంగా స్పందించి త్వరలో కోర్టు ఏర్పాటుపై ఆగస్టు నెలలో సత్వర కార్యక్రమాల ను ప్రారంభించే నేపథ్యంలో జిన్నారంలో కోర్టు ఏర్పాటుకు హైకోర్టు దృష్టికి తీసుకెళ్లడం పట్ల నర్సాపూర్ బార్ అసోసియే షన్ ప్రెసిడెంట్ దాసరి శ్రీకాంత్‌రెడ్డి జిల్లా కోర్టు భవాని చంద్రకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం మాట్లాడుతూ.. మండల కేంద్రమైన జిన్నారంలో ఐకేపీ భవనం కోర్టు ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నట్టు భవన పరిశీలన కార్యక్రమంలో జిల్లా కోర్టు జడ్జి భవాని చంద్ర సంతృప్తి వ్యక్తం చేశార న్నారు. ఈ మేరకు భవన పరిశీలన కార్యక్రమానికి విచ్చేసిన సంగారెడ్డి జిల్లా భవాని చంద్రకు నర్సాపూర్ కోర్టు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దాసరి శ్రీకాంత్‌రెడ్డి, జిన్నారం తహసీల్దార్ బిక్షపతి సీఐ వేణు కుమార్, ఎస్ఐ విజయ్‌రావు, అడ్వకేట్ బృందాలు, స్థానిక నాయకులు యువజనులు ఘన స్వాగతం పలికారని ఆయన చెప్పారు. జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటుకు సిద్ధంగా ఉన్న భవనాన్ని పరిశీలించిన నేపథ్య ంలో ఐకేపీ భవన సముదాయం అన్ని విధాల అనుకూలంగా ఉందని జిల్లా కోర్టు జడ్జి భవాని చంద్ర సానుకూలంగా స్పందించార న్నారు. జిన్నారం మండల కేంద్రంలో ప్రతిష్టా త్మకంగా పలు మండలా లకు చట్టపరమైన సమస్యలను పరిష్కరించుకోవడంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టును జిన్నారంలో ఏర్పాటు చేయాలనే విజ్ఞప్తి మేరకు నూతన కోర్టు ఏర్పాటుకు అనుమతి మంజూరైన నేపథ్యంలో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, న్యాయమూర్తులకు, సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి దామోదర్ రాజనర్సింహ, హైకోర్టు ప్రముఖ ప్రభుత్వ న్యాయ వాది సి.ప్రతాప్‌రెడ్డి, కలెక్టర్‌కు, నర్సాపూర్ బార్ అసోసి యేషన్ మాజీ అధ్యక్షులు ప్రముఖ సీనియర్ న్యాయవాది ఏ.అంజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ పటాన్చెరు నియోజకవర్గం ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్, మండల మాజీ ఎంపీపీ దమ్మగొని రవీందర్ గౌడ్, సంగారెడ్డి జిల్లా కోర్టు అధికారులకు దాసరి శ్రీకాంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

మై హెూమ్ అంకురలో జగన్నాథ రథయాత్ర



నవతెలంగాణ-రామచంద్రాపురం

తెల్లాపూర్ మున్సిపాల్టీ పరిధిలోని మై హెూమ్ అంకురలో సుమ ప్రవీణ్ ఆధ్వర్యంలో ఆదివారం జగన్నాథ రథయాత్ర అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయాన్నే మై హెూమ్ అంకురలోని కుటుంబ సభ్యులు పూరి జగన్నాథ రథయాత్రకు ప్రత్యేక పూజలు నిర్వహించి రహదారుల మీదుగా జై జగన్నాథ్ నినాదాలతో రథయాత్రను కొనసాగించారు. ఈ సందర్భంగా పలువురు చేసిన నృత్య ప్రదర్శన అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పిఎసిఎస్ చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి, శ్రీధర్, దినేష్, గణేష్, నగేష్, రామనారాయణ, కార్తీక్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఆటో యజమాని వివరాలు నమోదు చేసుకోవాలి



నవతెలంగాణ-జహీరాబాద్

ప్రతీ ఆటో యజమాని నియోజకవర్గంలోని తమ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో వివరాలను నమోదు చేసి.. 'మై ఆటో 'సేఫ్' అనే స్టికర్‌ను వేయించుకోవాలని జహీరా బాద్ సీఐ రవి తెలిపారు. జహీరాబాద్, కోహిర్, చిరాకుపల్లి, జహీరాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లలో ఎస్ఐలతో కలిసి ఆదివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవర్‌లో ఆయా మండలాలకు చెందిన 20060 ఆటోలకు సంబంధించిన యజమానుల వివరాలను నమోదు చేసినట్టు తెలిపారు. వారికి త్వరలోనే 'మై ఆటో 'సేఫ్' అనే స్టిక్కర్ను అందజేస్తామన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అందరూ ఉన్నత అధికారుల ఆదేశాలను పాటించాలని విజ్ఞప్తి చేశారు. లేనియెడల చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మారెడ్డి ఎస్ఐ జహీరాబాద్ టౌన్, ప్రసాద్‌రావు ఎస్ఐ జహీరాబాద్‌రూరల్, క్రిష్ణ ఎస్ఐ కోహిర్, నరేష్ ఎస్ఐ చిరాగ్‌పల్లి, సిబ్బంది పాల్గొన్నారు.



హజ్ యాత్రికులకు ఘన సన్మానం

నవతెలంగాణ-జహీరాబాద్

హజ్ యాత్ర ముగించుకోని వచ్చిన జావేద్ కాంగ్రెస్ పార్టీ టౌన్ మైనార్టీ ప్రెసిడెంట్ , చిరాగ్ పల్లీ గ్రామానికి చెందిన మహ్మద్ జాహూర్‌లను తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ యన్.గిరిధర్ రెడ్డి, ఉజ్వల రెడ్డిలు ఆదివారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో చిరాగ్ పల్లీ మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి,తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నల్లా.ప్రతాప్ రెడ్డి, ఎన్ఎస్‌యుఐ సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు పట్లోళ్ళ నాగిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్తర్ గోరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచితంగా స్వర్ణప్రాసన బూస్టర్



నవతెలంగాణ-రామచంద్రాపురం

రామచంద్రాపురంలోని ఎల్ఐజీలో గల శ్రీ కార్య సిద్ధి పంచముఖ అంజనేయస్వామి అలయ ఆశ్రమంలో ఆదివారం ఎస్విఎస్ వైద్య సేవలో భాగంగా 'స్వర్ణప్రాసన' అను ఆయుర్వేద రోగ నిరోధక బూస్టర్‌ను ఉచితంగా అందించారు. ఇది ప్రతీ మాసంలో పుష్యమి నక్షత్రం రోజున ఇవ్వడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. 0-16 ఏండ్ల వయస్సు లోపు పిల్లలకు దీని ద్వారా మంచి బుద్ధి, రోగ నిరోధక శక్తి పెంపొందుతాయని డాక్టర్ హిమబిందు తెలిపారు. ఆందోళన, దూకుడు, చిరాకు తగ్గించడంతోపాటు ఆటిజం, అభ్యాస ఇబ్బందులు, శ్రద్ధ లోపం హైపర్యాక్టివిటీ ఉన్న పిల్లలకు కూడా ఈ మందు ఎంతగానో సహాయపడుతుందన్నారు. కాగా ఈ శిబిరంలో 128 మంది పిల్లలు సేవను వినియోగించుకున్నారన్నారు. అలాగే ప్రతి మంగళవారము మరియు శనివారము ఉచిత వైద్య సేవలు మరియు ఉచిత కంటి పరీక్షలు అందుబాటులో ఉంటాయని డాక్టర్ హిమబిందు తెలిపారు. కాబట్టి ప్రజలు ఈ సేవలు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ ట్రష్టి శ్రీనివాస రాజు, ట్రస్టీలు వేదవతి, అమితా తదితరులు పాల్గొన్నారు.



సెంటర్ ఫర్ ట్రైనింగ్ అండ్ ఎంప్లాయ్మెంట్ కార్యాలయం ప్రారంభోత్సవం

నవతెలంగాణ-సంగారెడ్డి

సెంటర్ ఫర్ ట్రైనింగ్ అండ్ ఎంప్లాయ్మెంట్ కార్యాలయాన్ని హైదరాబాదులోని కూకట్‌పల్లి జంక్షన్‌లో కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ ఫౌండర్ అండ్ చైర్మెన్, కోర్స్ డైరెక్టర్ మంచి కట్ల అనిల్ కుమార్ స్టేట్ సెక్రెటరీ సోల్కంపల్లి ప్రభుతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురు పాల్గొన్నారు. కంది మండలానికి చెందిన సోల్కంపల్లి ప్రభు మాట్లాడుతూ ఇక ముందు కూడా స్వచ్ఛందంగా కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ ద్వారా ఇటువంటి నూతన కార్యక్రమాలు యథావిధిగా కొనసాగుతాయన్నారు. అలాగే విద్యార్థులకు మంచి భవిష్యత్తును ఇవ్వడానికి ఒక అడుగు ముందుకు వేసి సీసీఆర్ సంస్థ సెంటర్ ఫర్ ట్రైనింగ్ అండ్ ఎంప్లాయ్మెంట్‌ను ప్రారంభించిందన్నారు. అతి త్వరలోనే సీసీఆర్ ద్వారా లీగల్ సెల్ మరియు మీడియా సెల్‌ను కూడా స్థాపించి ప్రజలకు మేలు కలిగేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఫర్ ట్రైనింగ్ అండ్ ఎంప్లాయ్మెంట్ ట్రైనర్స్ కరీముద్దీన్,స్టేట్ సెక్రెటరీ అశోక్ కుమార్ కాకర్ల, సెంట్రల్ కమిటీ సభ్యులు గుండ్ల శివచంద్రం, ఎండి.అహ్మద్ స్టేట్ ప్రెస్ అండ్ మీడియా సెక్రెటరీ, జోనల్ కమిటీ సెక్రెటరీ నేవూరి రత్నాకర్, సెంట్రల్ కమిటీ సభ్యులు వై ప్రసాద్, సీసీఆర్ లీగల్ అడ్వైజర్ మణికంఠ,అశోక్ తదితరులు పాల్గొన్నారు.



పల్లె ప్రకృతి వనాలను గాలికొదిలేసిన అధికారులు

నవతెలంగాణ-సదాశివపేట

పల్లె ప్రకృతి వనాలను అధికారులు గాలికొదిలేశారని డీవైఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి అనిల్ ఆరోపించారు. సిద్దాపూర్ హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఉన్న పల్లె ప్రకృతి వనాన్ని డీవైఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ.. పట్టణాల్లోనూ ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కోసం గత ప్రభుత్వం పల్లె ప్రకృతి వనాలను నిర్మించిందన్నారు. అయితే మున్సిపల్ అధికారులు పార్కులను నిర్మించి.. వాటి నిర్వాహణను గాలికొదిలేశారన్నారు. దాంతో పార్కుల్లోని చాలా పరికరాలు విరిగిపోయాయని.. మరికొన్ని తుప్పుబట్టి పోయాయ న్నారు. ప్రజల నుంచి వేలాది రూపాయలు పన్నులు వసూలు చేస్తున్న అధికారులు.. ప్రజలకు సౌకర్యాలను కల్పించకపోవడం బాధాకరమ న్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి.. పల్లె ప్రకృతి వనాల్లో చెడిపోయిన పరికరాలను బాగు చేయాలన్నారు. రకరకాల పిచ్చి మొక్కలు మొలవడంతో అక్కడికి వెళ్లే ప్రజలకు, పిల్లలకు ప్రమాదాలు జరిగే అవకాశమున్నదని.. వెంటనే వాటిని తొలగించాలన్నారు. తిరిగి వాటిని వినియోగంలోకి తీసుకురావా లన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఎం శ్రీకాంత్, నాయకులు ప్రశాంత్, మహేష్, ఫెరోజ్, నరేందర్, కిరణ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేపీఎస్ అధ్యక్షుడు చంద్రశేఖర్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-సదాశివపేట

కార్మిక పోరాట సమితి(కేపీఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు కొత్తగొల్ల చంద్రశేఖర్ జన్మదిన వేడుకలను కేపీఎస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీజీఐఐసీ చైర్మెన్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు నిర్మల జయప్రకాశ్ రెడ్డి హాజర య్యారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రామ్‌రెడ్డి, పట్టణాధ్యక్షులు మునిపల్లి సత్యనారాయణ, మార్కె ట్ కమిటీ చైర్మెన్ సడకుల కుమార్, వైస్ చైర్మెన్ కృష్ణ, మైనార్టీ సెల్ అధ్యక్షులు సజ్జీ, మండలాధ్యక్షులు సిద్దన్న, మాజీ కౌన్సిలర్ అరుణ్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం త్వరలో ఎంఆర్ఎఫ్ మెదక్ ప్లాంట్‌లో జరగబోయే యూనియన్ ఎన్నిక ల్లో కేపీఎస్ యూనియన్ నుంచి అధ్యక్షుడిగా కొత్తగొల్ల చంద్రశేఖర్‌ను బోనకుర్తి మల్లేశం గారు బలపర్చగా.. కార్యవర్గ సభ్యులందరూ అంగీకరించారు.

సమస్యల వలయంలో ఖేడ్ గురుకులం

- మూడు నెలల కాస్మోటిక్ ఛార్జీలు పెండింగ్
- తాగునీటి సమస్యతో విద్యార్థుల అవస్థలు
- రెగ్యులర్ స్టాఫ్ లేకపోవడంతో పాఠశాలను వదులుతున్న విద్యార్థులు

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల సమస్యల వలయంలో కూరుకుపోయింది. కనీసం తాగునీటి సౌకర్యం కూడా సరిగ్గా లేకపోవడంతో విద్యార్థులు నానా అసవ్థలు పడుతున్నారు. దీనికితోడు రెగ్యులర్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు లేకపోవడంతో చాలామంది విద్యార్థులు టీసీలు తీసుకుని ఈ పాఠశాల నుంచి వెళ్లిపోతున్నారు. ఇంత జరుగుతున్నా ఆర్‌సీఓ కనీసం తనిఖీ కూడా చేయట్లేదని పేరేంట్స్ కమిటీ సభ్యులు ఆరోపిస్తున్నారు.



సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లోని గురుకులంలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు 480 మంది, కళాశాలలో 240 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అయితే ఈ గురుకులంలో కేవలం ఆగురుగురు ఉపాధ్యాయులు మాత్రమే రెగ్యులర్ కాగా.. మిగిలిన వారు పార్ట్ టైం గా బోధన చేస్తున్నారు. రెగ్యులర్ ప్రిన్సిపాల్ కూడా లేకపోవడం గమనార్హం. దాంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందకుండా పోతోంది. పాఠశాలలు ప్రారంభమై ఇన్ని రోజులవుతున్నా.. ఈ గురుకులంలో ఇప్పటివరకు నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు, పిటి డ్రెస్సు, ట్రంకు బాక్సులు, షూలు, బెడ్ షీట్లు, దుప్పట్లు ఇవ్వలేదన్నారు. దాంతో విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. టీచర్లు లేరని ఇప్పటికే అడ్మిషన్ అయిన విద్యార్థులు కూడా టీసీ తీసుకుని వెళ్ళిపోతున్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సీట్లు ఇప్పటికీ ఖాళీ ఉన్నాయి. వర్షాకాలంలో గురుకులాల్లో గడ్డి, చెత్తా చెదారం అపరిశుభ్రత ఉంటున్నాయని.. దాంతో దోమలు ప్రబలి విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉన్నదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెలకొకసారి వైద్య క్యాంపులు పెట్టాలని నిబంధన ఉన్నా.. అవేమీ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. స్టాప్ ఫ్యాటర్‌ను ప్రకారం రెగ్యులర్ ఉపాధ్యాయులు ఉండాలన్న నిబంధనలు కూడా పాటించడం లేదన్నారు. బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు చదువుకునే గురుకులాల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించొద్దన్నారు. వెంటనే సమస్యలన్నింటినీ పరిష్కరించాలన్నారు.



గతంలోనే ఆర్‌సీఓకు వినతి : పేరెంట్స్ అసోసియేషన్

రెగ్యులర్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు లేకుండా గురుకులాలు ఎలా నడుపుతారని ఆర్‌సీఓకు గతంలోనే వినతి పత్రం అందించినట్టు పేరెంట్స్ అసోసియేషన్ మెంబర్ బంగారు రాజు, సంజీవ్, నర్సింలు, శంకర్‌లు తెలిపారు. అయినప్పటికీ ఆర్‌సీఓ ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదని మండి పడ్డారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



ఆర్‌సీఓను సస్పెండ్ చేయాలి : ఎస్ఎఫ్ఐ



ఆర్‌సీఓ పాఠశాలలను సందర్శించకుండా కాలయాపనం చేస్తున్నారని.. అయన్ను వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి నల్లవల్లి రమేష్, సతీష్‌లు అన్నారు. పాఠశాలలో నాణ్యమైన భోజనం నాణ్యమైన వాటర్ లేక చాలా తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. గురుకుల పాఠశాలలో కిటికీలు లేక విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో తాగునీటికి ఆర్ఓ ప్లాంట్ ఉండేదని.. కానీ గురుకులాల్లో ఏ ఒక్కటి పనిచేయడం లేదన్నారు. ఆర్ఓ ప్లాంట్‌ను బాగు చేయాలన్నారు. మూడు నెలల నుంచి కాస్మోటిక్ ఛార్జీలు పెండింగ్ ఉన్నాయన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి.. గురుకులాల సమస్యలను పరిష్కరించాలన్నారు.

ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో ఉద్యోగాలు



నవతెలంగాణ-సంగారెడ్డి

ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో ఇంటర్ విద్యార్హతతో ఉద్యోగాలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 03 జూలై 2004- 03 జనవరి 2008 మధ్య జన్మించిన అవివాహిత మహిళా/ పురుష అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు https: //agnipath-vayu.cdac.inలో సంప్రదించాలన్నారు.



వైభవంగా పూరి జగన్నాథ్ రథోత్సవం

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

మండలంలోని బొల్లారం మున్సిపాల్టీలో గల పూరి జగన్నాథ్ క్షేత్రం పూరి జగన్నాథ్ స్వామి రథోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణం నుంచి సర్వీస్ రోడ్ వైపు భక్తిశ్రద్ధలతో రథోత్సవాన్ని నిర్వహించారు. అశేష భక్తజన సమక్షంలో పూరి జగన్నాథ్ రథోత్సవం కొనసాగింది. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్మిక నాయకులు వి.వరప్రసాద్‌రెడ్డి పాల్గొని.. పూరి జగన్నాథ్ స్వామిని దర్శించుకున్నారు. విద్యుత్ దీపాల వెలుగులో జాతర ఉత్సవాలు వైభవంగా కొనసాగాయి. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు సంతోష్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, నాగిరెడ్డి, సాయినాథ్ రెడ్డి, పద్మ నవీన్, ఆలయ సిబ్బంది, కమిటీ సభ్యులు, నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా జగ్గారెడ్డి పుట్టినరోజు వేడుకలు





నవతెలంగాణ-రామచంద్రాపురం

కాంగ్రెస్ పార్టీ జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షులు మహీస్ గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పుట్టినరోజు వేడుకలను ఆదివారం ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీఎజీఐఐసీ చైర్మెన్ మరియు డిసిసి ప్రెసిడెంట్ నిర్మల జగ్గారెడ్డి హాజరయ్యారు. రామచంద్రాపురం పట్టణంలోని రామాలయం వద్ద కేక్‌కట్ చేసి ప్రత్యేక పూజలు మరియు మొక్కలను నాటారు. అనంతరం ఈఎస్ఐ హాస్పిటల్‌లో రోగులకు పండ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జైపాల్, అరుణ్ గౌడ్, చిన్న, హబీబ్, మల్లేష్ గౌడ్, జ్ఞానేశ్వర్ గౌడ్, ఖదీర్, శ్రీనివాస్, శాంతమ్మ , వినోద్, శ్రీకాంత్ నాయక్ , రవి నాయక్, రాంజీ , సామ్రాట్ తదితరులు పాల్గొన్నారు.

సదాశివపేట : సదాశివపేట పట్టణ, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు జగ్గారెడ్డి జన్మదినం సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలు, టీజీఐఐసీ చైర్మెన్ నిర్మల జయప్రకాశ్‌రెడ్డి ఈ కార్యక్రమాల్లో పాల్గొని.. సదాశివపేట గవర్నమెంట్ ఆసుపత్రిలో రోగులను పరామర్శించారు. వారికి పండ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా కార్యకర్తలు రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి.. రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణాధ్యక్షులు సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రామ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ కంది కృష్ణ, మండలాధ్యక్షుడు చాట్ల సిద్ధన్న, మండల ఉపాధ్యక్షుడు దస్తూరి విట్టల్, సజ్జి, చోటుబాయ్, తుకారం, ఓబిసి అధ్యక్షుడు కడల అంజి, మాజీ మున్సిపల్ చైర్మెన్, ప్రస్తుత కౌన్సిలర్ పిల్లోడి విశ్వనాథం, ఎంఆర్ఎఫ్ కేపీఎస్ అధ్యక్షుడు కొత్తగొల్ల శేఖర్, పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు







నవతెలంగాణ-జహీరాబాద్

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) 30వ వసంతంలో అడుగుపెట్టిన సందర్భంగా జహీరాబాద్ పట్టణంలోని జాతీయ రహదారి రభస అతిథి గృహంలో అబ్రహం మాదిగ అధ్యక్షతన ఆదివారం జెండా పండుగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ వై.నరోత్తం హాజరై.. జెండా ఆవిష్కరించారు. రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ మాదిగ పుట్టిన రోజును పురస్కరించుకుని కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు. అనంతరం నరోత్తం మాట్లాడుతూ.. కృష్ణ మాదిగ త్యాగం వెలకట్టలేనిదన్నారు. ఆరోగ్య శ్రీ, వికలాంగుల పించన్లు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వర్గీకరణ ఫలితాలు సాధించిన ఘనత ఆయనకే సొంతమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రేందాస్, రాంచందర్, జైరాజ్, స్వామీదాస్ వరాలు, మోజెస్, శివకూమార్, రవీందర్, సందీప్, బండి మోహన్, శివప్ప, వసంత్, మధు, సునీల్, ముర్జల్ తదితరులు పాల్గొన్నారు.

కోహిర్ : చింతల్‌గట్టు గ్రామంలో ఎమ్మార్పీఎస్ 31 ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి పద్మారావు మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం, మహాజన నేత మంద కృష్ణ మాదిగ పుట్టినరోజు సందర్భంగా జెండాను ఆవిష్కరించినట్టు చెప్పారు.కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జయరాజ్ మాదిగ, మాజీ ఎంపీటీసీ మల్లన పాటిల్, జిల్లా నాయకులు సుధీర్‌కుమార్, సంపత్ కుమార్, మున్న, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ శ్రీరాములు మృతి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలి





నవతెలంగాణ-సంగారెడ్డి

అశ్వరావుపేట ఎస్ఐ శ్రీరాములు శ్రీనివాస్ మృతికి కారణమైన సీఐ, సిబ్బందిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్ డిమాండ్ చేశారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యంలో ఆదివారం సంగారెడ్డిలో నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా మాణిక్ మాట్లాడుతూ.. స్థానిక సీఐ జితేందర్ రెడ్డి వేధింపుల వల్లనే ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాసులు ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. పోలీసులకు సంబంధం లేని సివిల్ కేసుల్లో ఇన్వాల్వ్ కావాలని సీఐ బలవంతం పెట్టడం వల్లనే.. ఆ పని చేయలేక ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. చట్టాలు అమలు చేయాల్సిన ఎస్ఐకే కుల వివక్షత తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐ జితేందర్ రెడ్డిని ఇతర పోలీస్ ఉద్యోగస్తులను తక్షణమే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. శ్రీరాముల శ్రీనివాస్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని.. ఆయన భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి అశోక్ జిల్లా ఉపాధ్యక్షులు శివకుమార్, రాజు, యువన్యాయవాది సుభాష్, జిల్లా సహాయ కార్యదర్శి మల్లేశం, దాసు, సంతోష్, జిల్లా కమిటీ సభ్యులు జయకుమార్, జయరాం, గంగారం, విష్ణు, దాసు, ఆనంద్ పాల్గొన్నారు.

సంగారెడ్డి : ఖమ్మం జిల్లా అశ్వరావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ మృతిని నిరసిస్తూ వరల్డ్ ఉమెన్ రైట్స్ ఆధ్వర్యంలో సంగారెడ్డిలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరల్డ్ ఉమెన్ రైట్స్ పీపుల్ కౌన్సిల్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు డాక్టర్ డిక్కీ బాబు మాట్లాడుతూ.. స్థానిక సీఐ జితేందర్ రెడ్డి వేధింపుల వల్లనే ఎస్సై శ్రీరాముల శ్రీనివాసులు ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడన్నారు. సీఐ జితేందర్ రెడ్డిని ఇతర సిబ్బందిని విధుల నుంచి తొలగించాలని.. కఠిన శిక్షలు విధించాలన్నారు. ఎస్సై కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంతోష్, రఘు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు

- గీతం బాయ్స్ హాస్టల్లో ఫుడ్ సేఫ్టీ బృందం తనిఖీలు



నవతెలంగాణ-పటాన్‌చెరు

మండలంలోని రుద్రారంలో గల గీతం యూనివర్సిటీ బాయ్స్ హాస్టల్ మెస్‌లో ఎఫ్ఎస్ఎస్ఏఐ బృందం, మొబైల్ ప్రయోగశాల(ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్) ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్టల్లో ఉపయోగించిన వంట నూనెలో పరిమితి కంటే ఎక్కువ ధ్రువ గణన(పోలార్ కౌంట్) ఉండటం, కూరగాయలు ఫంగస్ సోకి ఉండటం, దాదాపు 224 కిలోల గడువు ముగిసిన పచ్చి చికెన్ ఉండటం, గడువు ముగిసిన టీ పొడర్, కాఫీ పొడర్, గడువు ముగిసిన స్ప్రింగ్ రోల్ ఉండటం, లేబుల్ లేని బిస్కెట్స్, లేబుల్ లేని సేమి ప్రిపేర్డ్ చికెన్, లేబుల్ లేని పచ్చి చికెన్, లేబుల్ లేని పచ్చి చాపలు ఉండటం, నీళ్ల నిలువ ఉండే ట్యాంక్ తుప్పు పట్టి ఉండటం గమనించారు. అనంతరం ఆ బృందం సభ్యులు మాట్లాడుతూ.. ఆరోగ్య శాఖ మంత్రి, కమీషనర్ ఫుడ్ సేఫ్టీ, జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ప్రభుత్వ నిబంధనలప్రకారం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నమూనాలు సేకరించి ల్యాబ్ కు పంపించడంతో పాటు నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. గడువు ముగిసిన ఆహార పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెూటళ్ళు, రెస్టారెంట్లు, బేకరీలు ఇతర ఆహార వ్యాపారులను హెచ్చరించారు.

డాక్టర్ కిషన్‌రావుకు జాతీయ అవార్డు



నవతెలంగాణ-పటాన్‌చెరు

పటాన్‌చెరు పారిశ్రామికవాడలో వెదజల్లుతున్న కాలుష్యంపై రాజీలేని పోరాటం చేసిన పటాన్‌చెరుకు చెందిన ప్రముఖ పర్యావరణ వేత్త డాక్టర్ అల్లాణి కిషన్‌రావుకు పౌర సంస్థ క్యాపిటల్ ఫౌండేషన్, సొసైటీ ఎర్త్ కేర్ ఎన్విరాన్‌మెంట్ జాతీయ అవార్డును అందజేసింది. శనివారం రాత్రి శామిర్‌పేటలోని నల్సార్ యూనివర్సిటీ ఆడిటోరియంలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో అటార్నీ జనరల్ ఆఫ్ ఇండియా వెంకటరమణి, రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ముఖ్య అతిథులుగా హాజరై పురస్కారాలు అందజేశారు. పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలో నాలుగు దశాబ్దాలుగా కాలుష్యంపై అలుపెరుగకుండా న్యాయ పోరాటం చేసిన డాక్టర్ కిషన్‌రావుకు జాతీయ అవార్డును వరించింది. కిషన్‌రావు అనారోగ్యంతో ఉండటంతో ఆయన కుటుంబ సభ్యులు అల్లాని రఘునాథరావు, వైష్ణవిలు అవార్డును, జ్ఞాపికను స్వీకరించారు. ఈ సందర్భంగా వక్తలు పర్యావరణ పరిరక్షణకు కిషన్‌రావు అందజేసిన సేవలను కొనియాడారు. ఫార్మా పరిశ్రమల ద్వారా వస్తున్న కాలుష్యంతో ఏర్పడుతున్న సమస్యలపై ఆయన రాజీలేని పోరాటం చేశారని గుర్తు చేసుకున్నారు. సుప్రీంకోర్టు, హరిత ట్రిబ్యునల్‌లో ఆయన అనేక కేసులు వేసి కాలుష్య సమస్యపై న్యాయ పోరాటం చేశారన్నారు. కిషన్‌రావు త్వరగా ఆరోగ్యవంతులు కావాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పర్యావరణవేత్త పురుషోత్తంరెడ్డి, మాజీ న్యాయమూర్తి ఏకే పట్నాయక్, పర్యావరణవేత్త శిల్ప,డా.ముత్యాలు, గిరిధర్, బీఎన్‌రెడ్డి పాల్గొన్నారు.

8 వారాలైనా ఇవ్వని 'ఉపాధి' డబ్బులు



నవతెలంగాణ-సంగారెడ్డి

ఉపాధి హామీ కూలీలకు 8 వారాలైనా కూలి డబ్బులు ఎందుకు ఇవ్వట్లేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.నరసింహులు ప్రభుత్వ అధికారులను ప్రశ్నించారు. ఈ మేరకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డీఆర్‌డీఏ పీడీ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సిములు మాట్లాడుతూ.. కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీని నిర్వీర్యం చేయడం కోసం శతవిధాల ప్రయత్నాలు చేస్తున్నదన్నారు. పనిచేసిన 15 రోజుల్లో కూలి డబ్బులివ్వాలని చట్టం చెబుతుంటే.. 8 వారాలైనా ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. పని ప్రదేశంలో టెంట్లు, మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మంచినీళ్ల కచ్చితంగా ఉంచా లన్నారు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో.. పని ప్రదేశంలో దెబ్బలు తగిలితే మట్టిని పూసుకోవాల్సి వస్తున్నదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా రోజు కూలి రూ.800 పెంచాలని, ఏడాదిలో 200 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీలో జియో ట్యాగింగ్ వ్యవస్థను రద్దు చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ఎనిమిది వారాల ఉపాధి బకాయిలను వెంటనే ఇవ్వాలని లేని ఎడల పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి.ఏషోబు, కుమార్, రాజు, గోపాల్, శేఖర్, సి.హెచ్ నరసింహులు, దాసు, బి నర్సింలు, తుల్జరం తదితరులు పాల్గొన్నారు.

మాజీ జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు సన్మానం



నవతెలంగాణ-మునిపల్లి

మండల తాజా మాజీ జెడ్పీటీసీ పైతర మీనాక్షి సాయి కుమార్, మాజీ ఎంపీటీసీలు రాజశేఖర్, శివకుమార్, స్వప్న, లక్ష్మీలను ఆదివారం పోల్కంపల్లి గ్రామ శివారులో గల శ్రీసాయి గార్డెన్‌లో బీఆర్ఎస్ మండల నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మీనాక్షి సాయికుమార్ మాట్లాడుతూ.. గత ఐదేండ్ల బీఆర్ఎస్ పాలనలో మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు గుర్తు చేశారు. ఇందుకు మండలంలోని ప్రజాప్రతినిధులు అధికారులు ప్రజలు ఎంతగానో సహకరించారఅన్నారు. అభివృద్ధికి సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, పీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మెన్, పైతర సాయికుమార్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు గడ్డం భాస్కర్, గోపులారం తాజా మాజీ సర్పంచ్ కీర్తి కుమారి, మండల నాయకులు పిల్లోడి నాగేష్, గార్లపల్లి శంకరయ్య ఈశ్వరప్ప, తాటిపల్లి భాస్కర్, బోడపల్లి శ్రీనివాస్, కన్నా కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
మనగు తెలుగు దినపత్రిక
3
మెదక్
సోమవారం | 08 జులై 2024 | www.navatelangana.com

పంచాయతీ కార్మికుడిని పరామర్శించిన సీఐటీయూ నాయకుడు



నవతెలంగాణ-మనోహరాబాద్

గ్రామంలో వీధి దీపాలను మరమ్మత్తులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడడంతో వెన్ను పూస విరిగి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పంచాయితీ కార్మికుడిని సీఐటీయూ జిల్లా పంచాయతీ కార్మిక సంఘం కార్యదర్శి ఆసిఫ్ పరామర్శించారు. ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆదివారం ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడు మహేష్‌ను ఆసిఫ్ పరామర్శించారు. శివంపేట మండలం పెద్ద గొట్టిముక్ల గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ కార్మికుడు మహేష్ గత నెల 23న గ్రామంలోని వీధి దీపాలను మరమ్మత్తు చేస్తు కాలు జారి కింద పడ్డాడు. కార్మికుడి ఆరోగ్య పరిస్థితి బాగుపడే వరకు అతనికి ప్రతినెల వేతనం ఇవ్వాలని, అలాగే కార్మికుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆసిఫ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు చంద్రయ్య, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

శ్రీశ్రీశ్రీ ఉజ్జయిని మహంకాళి జాతర ఏర్పాట్లపై సమావేశం



నవతెలంగాణ-తూప్రాన్

శ్రీశ్రీశ్రీ ఉజ్జయిని మహంకాళి జాతర ఏర్పాట్లపై సమావేశం తూప్రాన్ మహంకాళి అమ్మవారి జాతర సందర్భంగా నిర్వాహక సమావేశం ఆదివారం ఉదయం 11.00 గం.లకు నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ మామిళ్ల జ్యోతి కృష్ణ సమక్షంలో అమ్మవారి దేవాలయములో పూజలు చేశారు. ఈ సమావేశంలో తూప్రాన్ మున్సిపాలిటీలోని అన్ని కులాల ప్రజలు ప్రజలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సంవత్సరం శ్రీశ్రీశ్రీ ఉజ్జయిని మహంకాళి జాతర వైభవంగా, ఎంతో ఉత్సాహంగా పనిబాటలవారి సహకారంతో సంతోషకరమైన వాతావరణంలో నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ దీపక్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు రవిగుప్తా , శ్రీశైలం గౌడ్, రఘుపతి, నర్సోజి, సత్యలింగం, మామిడి వెంకటేశం, మాజీ సర్పంచ్ శివమ్మ, సమావేశ అనుసంధానకర్త విద్యావేత్త వెంకటనారాయణ, సర్గల నర్సింగరావు, కుల, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మత్స్య కార్మిక కుటుంబాలకు బీమా డబ్బులు చెల్లించాలి

- వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు



నవతెలంగాణ-మెదక్ టౌన్

ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని, 38 మత్స్య కార్మిక కుటుంబాలకు చెల్లించాల్సిన రెండు కోట్ల రూపాయల పెండింగ్ ప్రమాద బీమా డబ్బులు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పి.దేవయ్య, కె.మల్లేశంలు డిమాండ్ చేశారు. మెదక్ జిల్లా కేంద్రంలో కేవలం కిషన్ భవనంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు పి దేవయ్య, కే మల్లేశంలు మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల్లో భాగంగా పేదలకు పింఛన్లు ఇవ్వాలని ఇండ్లు, ఇళ్ల స్థలాలు, కౌలు రైతులకు, రూ.12000, వ్యవసాయ కూలీలకు రూ.12000 రైతు భరోసా డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అధికారుల నిర్లక్ష్యం వలన 38 మత్స్య కార్మిక సంఘం సభ్యుల ప్రమాద బీమా రెండు కోట్లు ఇస్తామని హామీ ఇచ్చిన మత్స్యశాఖ జిల్లా అధికారి వెంటనే ఇప్పించాలని డిమాండ్ చేశారు. మత్స్య కార్మిక కుటుంబాల సభ్యులు అధికారులకు జిల్లా కలెక్టర్‌కి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజులు కుటుంబాలతో జనవరి 30 31 తేదీలలో కలెక్టర్ కార్యాలయం ముందు నిరాహార దీక్షలు చేయడంతో మత్స్యశాఖ అధికారి 31వ తేదీన దీక్షా శిబిరానికి వచ్చి డబ్బులు చెల్లిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. కావున హామీ ఇచ్చిన ప్రకారం మత్స్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ప్రమాద బీమా డబ్బులు రెండు కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఐలయ్య, రామస్వామి, నరేందర్, నాగమణి, వెంకటి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

- జెండా ఆవిష్కరణ
- మందకృష్ణ మాదిగ పుట్టినరోజు వేడుకలు

నవతెలంగాణ-హవేలి ఘనాపూర్



మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 30వ ఆవిర్భవం సందర్భంగా జెండా ఆవిష్కరణ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ, మాదిగ జాతి ముద్దుబిడ్డ మందకృష్ణ మాదిగ 60వ జన్మదిన వేడుకలు ఎమ్మార్పీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సమాజంలో ఏ వర్గానికి అన్యాయం జరిగినా అక్కడ ఎమ్మార్పీఎస్ నాయకత్వం ముందుండి న్యాయ పరమైన పోరాటం చేసిందన్నారు. ఎస్సీల ఎ.బీ.సీ.డీ. వర్గీకరణ మరి కోద్ది రోజుల్లో జరుగబోతుందన్నారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును చట్టబద్ధత కల్పిస్తూ ఎస్సి వర్గీకరణ చేయాలని కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్, నాయకులు శంకర్ మాదిగ, ఎమ్మార్పీ జిల్లా కార్యదర్శి రవి, ఎమ్మెస్ ఎఫ్ జిల్లా కన్వీనర్ మస్కూరి కిరణ్ కుమార్ మాదిగ, హవేలీ ఘనపూర్ మండల అధ్యక్షులు సంజీవ్ మాదిగ, మండల నాయకులు సిద్ధిరాములు మాదిగ, ఔరంగాబాద్ ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు చెప్యాల స్వామి మాదిగ, గ్రామ కమిటీ నాయకులు మండల కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నెలలు గడుస్తున్నా పూర్తికాని రోడ్డు పనులు

రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలి
సీపీఐ(ఎం) నాయకుల డిమాండ్



నవతెలంగాణ-కొండపాక

మండల పరిధిలోని బందారం గ్రామం ఊరు మధ్య ప్రభుత్వ పాఠశాల నుంచి ఊర చెరువు కట్ట వరకు రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయకుండా వదిలిపెట్టడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే రోడ్డు పనులు పూర్తి చేయాలని సీపీఐ(ఎం) బృందం బందారం గ్రామాన్ని సందర్శించి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) మండల కార్యదర్శి అమ్ముల బాల నర్సయ్య మాట్లాడుతూ కొన్ని నెలలు గడుస్తున్నా రోడ్డు నిర్మాణ పనులు పూర్తి కావడం లేదని, ఇప్పటికైనా వెంటనే నిర్మాణ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ. దుద్దేడ నుంచి బందారం తిమ్మాయపల్లి మీదుగా నంగునూరు మండల కేంద్రానికి, తిమ్మాయపల్లి నుంచి హన్మకొండ రోడ్డుకు వెళ్లడానికి మెయిన్ రోడ్డుగా ఉంటుంది. రోడ్డును బందారం గ్రామంలో జెడ్పీహెచ్ఎస్ పాఠశాల నుంచి మొదలుకొని బస్టాండ్ మీదుగా ఊర చెరువు కట్ట వరకు కంకర బోసి వదలడంతో నిత్యం రాకపోకలకు అనేక ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. కూరగాయల బజారు నడుపుకోవడానికి కూడా స్థలం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్డుపై నడవడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారని మోటార్ సైకిల్‌పై వెళ్లేవారు కంకర రాళ్లతట్టి పడి కాళ్ళు చేతులు విరిగే పరిస్థితి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణ పనులు మధ్యలో వదిలి పెట్టారన్నారు. పని విషయమై కాంట్రాక్టర్ను అడిగితే కాంట్రాక్టర్ పొంతనలేది సమాధానాలు చెప్తున్నారని ప్రభుత్వం పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. వెంటనే రోడ్డు నిర్మాణాన్ని చేపట్టి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి ఆందోళన కార్యక్రమం చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు కొమురయ్య, మల్లేశం, యాదయ్య బందారం ప్రజలు పాల్గొన్నారు

నూతన సంఘ కార్యవర్గ ఎన్నిక..



నవతెలంగాణ-కోహెడ

మండల పరిధిలోని కూరేళ్ల గ్రామ నూతన మున్నూర్ కాపు సంఘ కార్యవర్గ ఎన్నికలు నిర్వహించినట్టు గౌరవ అధ్యక్షుడు గాజుల మల్లయ్య అదివారం తెలిపారు. నూతన సంఘాధ్యక్షుడు గాజుల చిన్న మల్లయ్య ఉపాధ్యకుడు బండారి నరేశ్, కార్యదర్శి బండారి లక్ష్మన్, కార్యవర్గ సభ్యుల ఎన్నికైనట్టు గాజుల మల్లయ్య తెలిపారు. ఈ నెల 16న మంకాళమ్మ జాతర నిర్వహించడానికి నూతన కార్యవర్గ సభ్యులు తీర్మాణించినట్టు సభ్యులు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గ కమిటీ సభ్యులను కుల బాంధవులు శాలువ కప్పి సన్మానించారు.

రైతుల చూపు సన్నాల వైపు

- ప్రభుత్వం రూ.500బోనస్ ప్రకటించడంతో అన్నదాత ఆసక్తి
- యాసంగిలో తేమ ఉన్నా మంచి ధర ఇచ్చిన మిల్లర్లు
- తగ్గనున్న దొడ్డు రకం సాగు

నవతెలంగాణ పెద్దశంకరంపేట

ఇటీవల ప్రభుత్వం సన్న రకం వడ్లకు మద్దతూ ధరకంటే రూ 500 ఎక్కువగా ఇస్తామని ప్రకటించడంతో రైతులు సన్న రకం వరి సాగుకు మొగ్గు చూపుతున్నారు. యాసంగిలో దొడ్డు రకం వరి సాగు చేసిన రైతులు ఈ వానాకాలంలో సన్న రకం సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఒక వేల ప్రభుత్వం సన్న రకం వడ్లను కొనుగోలు చేయకున్నా మండలంలో అత్యాధునిక రైస్ మిల్లులు ఆయా మిల్లు యాజమాన్యం ధన్యంలో తేమ శాతం 25 నుంచి 30 వరకు ఉన్న ఎలాంటి అభ్యంతరం చెప్పకుండా క్వింటాలుకు రూ 2500 నుంచి 3000 వరకు చెలించి కొనుగోలు చేస్తుండడంతో సన్నాలు సాగు చేసి వెంటనే విక్రయించుకుందామని ఆలోచనలో రైతులు ఉన్నారు.

దొడ్డు రకంతో ఇబ్బందులు

గత యాసంగి సీజన్లో మండల పరిదిలోని దాదాపు 4000 ఎకరాలలో వరి సాగు చేశారు. దొడ్డు రకం వరి సాగు చేసిన రైతులు ధాన్యం అరబెట్టి కొనుగోలు కేంద్రాలలో విక్రయించడానికి ఇబ్బందులు పడుతున్నారు. దొడ్డ రకం పంట కాలం సైతం తక్కువ ఉంటుంది. దీంతో రైతులు ఎక్కువ కాలంలో చేతికొచ్చే సన్నాలనే సాగు చేస్తున్నారు. సన్నరకం వరికి దొడ్డు రకం వరికి 30 రోజుల కాల వ్యవది ఉంటుంది. దొడ్డు రకం ఎకరానికి 35 నుంచి 40 బస్తాల వరకు దిగుబడి వస్తుండడంతో రైతులు ఆ వైపు మొగ్గ చూపుతున్నారు.

వానాకాలంలో రెండింతలయ్యే అవకాశం

ఈ వానాకాలంలో సన్నాల సాగు యాసంగి కంటే రెండింతలయ్యే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా చేస్తున్నారు. ప్రభుత్వం క్వింటాలుకు రూ 500 బోనస్ ప్రకటించడంతో సన్నాల సాగుపై మరింత ఆసక్తి పెరుగుతుంది. పంట కాలం 120-130 రోజులు వరకు కోతకు వచ్చే రకాలను సాగుచేయాలని రైతులకు వ్యవసాయ శాఖ సూచిస్తుంది. మండల పరిధిలోని చాలా గ్రామాల్లో రైతులు సన్న రకం వరి విత్తనాలు నారు పోసుకొని నాటుకు సిద్ధమవుతున్నారు.

ఎకరాకు 45 బస్తాలు దిగుబడి.

పరిగప్ప గారి బేతయ్య, సంగారెడ్డిపేట.



యాసంగిలో రెండు ఎకరాలలో తెలంగాణ సోనా రకం సాగు చేశా. ఎకరానికి 45 బస్తాలు చొప్పున దిగుబడి వచ్చింది. క్వింటాలుకు 2500 ధర చెలించి మిల్లర్లు కొనుగోలు చేశారు. పచ్చి ధాన్యం కావడంతో తూకం సైతం బాగా కలసి వచ్చింది. ఈ వానాకాలంలో మళ్ళీ ఇదే రకం సాగుకు సిద్ధమయ్య



రైతులు సన్నలకే మొగ్గు

యాదగిరి, మండల వ్యవసాయ అధికారి



యాసంగిలో రైతులు ఎక్కువగా దొడ్డు రకం వరిని సాగుచేశారు. వానాకాలంలో కొంత మంది రైతులు సన్నరకం సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఈ సీజన్‌లో మండలంలో సన్నాల సాగు పెరిగే అవకాశం ఉంది అధిక దిగుబడిని ఇచ్చే సన్న రకం వరి విత్తనాలు చాలా రకాలు అందుబాటులో ఉన్నాయి. రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదిస్తే సలహాలు, సూచనలు ఇస్తారు. ఇప్పటికే సన్నరకం వరి విత్తనాలు అధికంగా కొనుగోలు చేస్తున్నారు.

వేతనాలు రూ.26 వేలకు పెంచాలి

- 2వ రోజు అంగన్ వాడి ఉద్యోగుల సమ్మె

నవతెలంగాణ-మెదక్ టౌన్



పెరిగిన ధరల కనుగుణంగా అంగన్వాడీలకు తక్షణమే కనీస వేతనాలు రూ.26 వేలకు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని అంగన్ వాడి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సమ్మ డిమాండ్ చేశారు. అంగన్వాడి టీచర్లు, ఆయాలతో కలిసి కలెక్టర్ కార్యాలయం ముందు 2వ రోజు ఆదివారం దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సమ్మ మాట్లాడుతూ రిటైర్మెంట్ బెనిఫిట్ టీచర్‌కు రూ.2 లక్షలు, హెల్పర్లకు రూ.1 లక్ష సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వీఆర్ఎస్ సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం ప్రభుత్వం మారి రేవంత్ రెడ్డి సీఎం అయి ఏడు నెలలు గడుస్తున్నా అంగన్వాడీల పట్ల కక్షపూరితంగా పాత జీవో 10ని తీసుకువచ్చి అతి తక్కువ డబ్బులు ఇచ్చి 65 సంవత్సరాలు దాటిన వారందరిని నిర్దాక్షిణ్యంగా జులై 1 నుంచి ఇంటికి పంపాలని నిర్ణయించడం దుర్మార్గమన్నారు. అంగన్వాడీలకు గత ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని, జీతంలో సగం పెన్షన్ ఇవ్వాలని నర్సమ్మ డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాలను గడగడలాడించిన అంగన్వాడీలు సమస్యలు పరిష్కరించకపోతే ఆ ప్రభుత్వాలకు పట్టిన గతే రేవంత్ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. తక్షణమే రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచి విఆర్ఎస్ సౌకర్యం కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. అంగన్వాడీలు 48 సంవత్సరాలుగా ఎన్నో పోరాటాలతో కొన్ని హక్కులు సాధించుకున్నామని, అంగన్వాడీలు ఎన్నో రకాల సేవలు ప్రజలకు అందిస్తున్నారని సంబంధం లేని పనులు చేయిస్తున్నారని ప్రజలలో తలలో నాలుక మాదిరిగా ఉంటున్నారన్నారు. వారి సేవలను గుర్తించి వారికి ఇవ్వాల్సిన బెనిఫిట్స్ తక్షణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

నిజాంపేటలోపూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలోని రేణుక ఫంక్షన్ హాల్‌లో 1995-1996 బ్యాచ్‌కి చెందిన విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. యువతీ యువకులు పాటలు పాడుతూ డ్యాన్సులు చేస్తూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా దుబాసి భాస్కర్, రేణుక, మాట్లాడుతూ 28 సంవత్సరాల తర్వాత కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను కలుసుకొని సన్మానించడం చాలా ఆనందంగా ఉందన్నారు. తమ బ్యాచి ఒక ట్రస్ట్‌గా ఏర్పడి తమతో చదువుకున్న విద్యార్థులకు ఎలాంటి ఆపద వచ్చినా వారిని ఆదుకోవడానికి తాము ముందుంటామన్నారు. తమను చూసి ఇతర బ్యాచిలు కూడా ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీచర్లు ఆంజనేయులు చారి, బాలయ్య, జనార్ధన్ రెడ్డి, మల్లయ్య, సత్యానందం, మహిపాల్, రాజిరెడ్డి, విద్యార్థులు రేణుక, అనిత, ఉదయ, కృష్ణవేణి, శిరీష, అరుణ, రాధ, కవిత, స్పందన, యాదగిరి, కుంచం సిద్ధ రాములు, రామంజి, ప్రభాకర్, బాదే రమేష్, రవీందర్, తిరుపతి, వెంకట్ గౌడ్, జీడి స్వామి గౌడ్, పంజా భూపాల్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై కళాకారుల బృందంచే అవగాహన

నవతెలంగాణ-నార్సింగి



మండల పరిధి గ్రామమైన శేరిపల్లిలో ఎస్ఐ అహ్మద్ మొహిఉద్దీన్ ఆధ్వర్యంలో కళా బృందం సభ్యులైన హెడ్ కానిస్టేబుల్ సురేందర్, జనార్ధన్, ఇమ్మాన్యూల్ ప్రజలకు ఆదివారం పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు, మహిళల పై దాడులు, మహిళల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, బాలల పై దాడులు, వరకట్న వేధింపులు, ట్రాఫిక్ నిబంధనలు, నూతన చట్టాల అమలుపై మాటలు, ఆటలతో చైతన్యం కల్పించారు. ట్రిబల్ రైడింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్, మద్యం తాగి వాహనం నడపడం, రాంగ్ రూట్లో నడపడం వల్ల ప్రమాదానికి గురైతే ప్రమాద భీమా చేసుకుని ఉన్నా భీమా డబ్బులు రావని తెలిపారు. చట్టాలు ప్రజల రక్షణ, మేలు కొరకు చేశారని అధిగమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. అందరూ మత్తు పదార్థాల వాడకం నుంచి దూరంగా ఉండాలని, అమూల్యమైన జీవితాన్ని నాశనం చేసుకోకూడదన్నారు. జులై ఒకటవ తేదీ నుంచి నూతన చట్టాలు అమలులోకి వచ్చాయని, నూతన చట్టాలు కఠినంగా ఉన్నాయని, అసాఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన శిక్షలు పడతాయని, పాత చట్టాల ప్రకారం ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం ఉండేదని, నూతన చట్టాలతో మార్పు వచ్చిందని, నేరస్తులకు లాఠీ పోలీసులని తెలిపారు. సైబర్ నేరాలకు మూలం అత్యాశ, అజ్ఞానమని, ఎవ్వరూ డబ్బులు ఊరకే ఇవ్వరని, ఆశ పడితే మోస పోతామన్నారు. ఫోన్ పై వచ్చిన ఎలాంటి లింకులను ఓపెన్ చేయకూడదని, బ్యాంకు, ప్రభుత్వ శాఖల వారు ఫోన్‌కు ఎలాంటి లింకులు పంపించరని గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ తాజా మాజీ సర్పంచ్ చెప్యాల మల్లేశం, తాజా మాజీ ఉప సర్పంచ్ భాగ్యలక్ష్మి రమేష్ యాదవ్, మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు బోయిని రమేష్, మాజీ వార్డు సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, యువజన సంఘాల నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే కఠిన చర్యలు



నవతెలంగాణ-పెద్దశంకరంపేట

ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదని, చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని పేట ఎస్ఐ శంకర్ పేర్కొన్నారు. ఆదివారం పెద్దశంకరంపేటలో నాందేడ్ అకోలా 161వ జాతీయ రహదారిపై వాహనదారుల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శంకర్ మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా అతివేగంగా వాహనాలు నడుపుతూ ఇతర వాహన దారులకు ఇబ్బంది కల్గించినా, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ నిర్వహించినా అట్టి వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకొని భారీ జరిమానా విధిస్తామని తెలిపారు. మైనర్లు వాహనలు నడుపుతూ పట్టుబడినా, మద్యం త్రాగి వాహనాలు నడిపి పట్టుబడినా, నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు రోడ్డుపై వచ్చినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో గత నాలుగు రోజుల నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ప్రమాదాలు జరగకుండ చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు పనులు ప్రారంభించి.. మధ్యలోనే ఆపేశారు

- తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు
- పనులు ప్రారంభించరా సారూ.. !



నవ తెలంగాణ-మిరుదొడ్డి

రోడ్డు మరమ్మత్తుల కోసం బీటీ రోడ్డు పనులు మొదలుపెట్టి సంవత్సరం గడిచినా పట్టించుకోకపోవడంతో ప్రమాదకరంగా మారింది. నెలల తరబడి పనులు ప్రారంభించిన ఆర్ అండ్ బి అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామం నుంచి గుడికందుల గ్రామం వరకు బిటి రోడ్డు మరమ్మతుల కోసం గత సంవత్సరం క్రితం పనులు మొదలు ప్రారంభించడం జరిగిందన్నారు. వీటిలో నిర్మాణం పనులను మంత్రి హరీష్ రావు హయాంలో కొబ్బరికాయ కొట్టడం జరిగింది. ఆయన నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు రోడ్డు పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరచుగా అల్వాల గ్రామంలో ఎక్కువగా రోడ్డు ప్రమాదం జరుగుతున్న అధికారులకు పట్టింపు లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు ఆల్వాల నుంచి గుడికందుల వరకు ఐదు కిలోమీటర్ల రోడ్డును కాంట్రాక్టు బిల్లులు రాలేదని ఉద్దేశంతోనే ఈ రోడ్డు నిర్మాణ పనులు మార్గ మధ్యలోనే ఆగినట్లు కాంట్రాక్టు తున్నారు. అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం మూలంగా నేటికీ ఆ పనులను పట్టించుకోకపోవడంతో వర్షాకాలం కావడంతో గుంతల మయంగా మారి ప్రమాదాలు చోటు చేసుకోవడం జరుగుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రతిరోజు అల్వాల నుండి సిద్దిపేటకు వెళ్లాలంటే ఎన్నో ప్రమాదాలు జరుగుతున్న దుస్థితి నెలకొన్నది. రోడ్డు సరిగా లేకపోవడంతో ప్రతిరోజు ఇబ్బందులు పడుతూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికులు రోడ్డుపై వెళ్లాలంటే ఎక్కడ ప్రమాదం జరుగుతుందని భయంతో గురవుతున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి రోడ్డు పనులను చేపట్టాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లో పనులను ప్రారంభించకపోతే గ్రామ జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన అల్వాల గ్రామం నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు పాదయాత్ర చేపడతామని హెచ్చరించారు.



ఐదు కిలోమీటర్ల రోడ్డును నిలిపివేశారు

పోలీస్ రాజులు వైస్ ఎంపీపీ అల్వాల



అల్వాల గ్రామం నుంచి గుడికందుల వరకు రోడ్డు పనులు త్వరలో పూర్తి చేయాలి. ప్రతిరోజు ద్విచక్ర వాహనాలు ఆటోలపై వెళ్తుంటే రోజుకో ప్రమాదం జరుగుతూ ఉంది. అల్వాల్ నుంచి గుడికందుల వరకు ఐదు కిలోమీటర్ల రోడ్డు మంజూరైన కాంటాక్ట్ నిర్లక్ష్యం మూలంగా పనులు పూర్తి చేయడం లేదు ఉన్నత అధికారులు చొరవ తీసుకొని రోడ్డు పనులు త్వరలో పూర్తి చేయాలి

పనులు త్వరగా పూర్తి చేయాలి

ప్రసాద్ అల్వాల బిఆర్ఎస్ నాయకులు



అల్వాల్ నుంచి గుడికందుల వరకు రోడ్డు పనులు ప్రారంభం చేసి పనులు త్వరలో పూర్తి చేయాలి ప్రతిరోజు రాత్రింబవలు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నాయి. వ్యవసాయంపై వెళ్లే రైతులు ఉంటే రాత్రి సమయంలో రైతులు ఇబ్బందులు పాలవుతున్నారు. ఉన్నతాధికారులు తీసుకుని రోడ్డు పనులు త్వరలో పూర్తి చేయాలి

జేఏసీ పక్షాన పోరాడుతాం

హైమద్ కోఆప్షన్ సభ్యులు అల్వాల

ఉన్నతాధికారులకు తెలిపిన కూడా రోడ్డు పనులు పట్టించుకోకపోవడం సరికాదు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వలన ఈ రోడ్డు మధ్యలోనే నిలిపివేయడం జరిగింది. వెంటనే జిల్లా కలెక్టర్ చర్య తీసుకొని అల్వాల గ్రామం నుంచి ఉన్న రోడ్డును పూర్తి చేయాలి. లేనియెడల ఆల్వాల్ గ్రామం జేఏసీ పక్షాన పార్టీలకతీతంగా అల్వాల నుంచి సిద్దిపేట వరకు పాదయాత్ర చేస్తాం.

సీఐ జీతేందర్ రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలి

అంబేద్కర్ యువజన సంఘ పట్టణాధ్యక్షుడు రాజ్ కుమార్ డిమాండ్
ఎస్ఐ శ్రీనివాస్ మృతికి కొవ్వొత్తులతో నివాళులు



నవతెలంగాణ-బెజ్జంకి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్‌ను మానసికంగా ఇబ్బంది గురిచేసిన సీఐ జితేందర్ రెడ్డితో పాటు నలుగురు కానిస్టేబుల్లపై శాఖ పరమైన చర్యల చేపట్టి విధుల నుండి సస్పెండ్ చేయాలని అంబేడ్కర్ యువజన సంఘ కొత్త రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. అదివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం చౌరస్తా వద్ద అంబేడ్కర్ పట్టణాధ్యక్షుడు కొత్త రాజ్ కుమార్ అధ్వర్యంలో ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ మృతికి దళిత సంఘాల నాయకులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు.దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏండ్లు గడుస్తున్నా దళిత బహుజన వర్గాలపై దాడులకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన కఠిన చర్యలు చేపట్టి అరికట్టడంలో పాలకులు విఫలమయ్యారని..ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి దళిత బహుజనులపై దాడులను అరికట్టేల పటిష్టమైన చట్టాలను అమలు చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని అంబేడ్కర్ యువజన సంఘ సభ్యులు కోరారు. దళిత హక్కుల పోరాట సమితి జిల్లా సహాయ కార్యదర్శి బోనగిరి రూపేష్,లింగాల శ్రీనివాస్,బొర్ర సురేష్,మిద్దె రవి,ఉప్పులేటి బాబు, రామంచ సంజీవ్,సంగెం రూపేష్,లింగంపల్లి అనిల్, అంబేద్కర్ సంఘం నాయకులు,యువకులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
మనసు తెలుగు దినపత్రిక
4
సిద్దిపేట
సోమవారం | 08 జులై 2024 | www.navatelangana.com

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను అందించిన పోలీసులు

నవతెలంగాణ-జగదేవపూర్



పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ను జగదేవపూర్ పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితునికి అందజేశారు. జగదేవపూర్ ఎస్.ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం, తీగుల్ గ్రామానికి చెందిన స్వర్గం పర్శరాములు కొద్ది రోజుల క్రితం తన వివో సెల్‌ఫోను తీగుల్ గ్రామంలో పోగొట్టుకున్నాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీస్ సిబ్బంది జి.రమేష్ సిఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్ యాప్‌లో సెల్ ఫోన్ వివరాలు నమోదు చేసి బ్లాక్ చేశారు. పోగొట్టుకున్న సెల్ ఫోన్ సీఈఐఆర్ ద్వారా స్వాధీన పరచుకున్న తర్వాత బాధితున్ని జగదేవపూర్ పోలీస్ స్టేషన్‌కి పిలిచి ఫోన్‌ను అందించారు. ఎవరైనా ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే ఫోన్, ఇతర వివరాలు సి ఈ ఐ ఆర్ పోర్టల్ లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తాజోద్దీన్,రమేష్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న ఎంసెట్ ధృవీకరణ పత్రాల పరిశీలన

నవతెలంగాణ-నంగునూరు



నంగునూరు మండలం రాజగోపాలపేట పాలిటెక్నిక్ కళాశాలలో ఇంజనీరింగ్ ప్రవేశాల కొరకు ధృవీకరణ పత్రాల పరిశీలన కొనసాగుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సూర్య నారాయణ తెలిపారు. ఈ నెల 10 వరకు సర్టిఫికేట్ పరిశీలన కొనసాగుతుందని చెప్పారు. ఆదివారం 500 మంది హాజరయ్యారు. నితిన్ పవార్, మాణిక్యం, సీహెచ్.శ్రీనివాస్, రాజు, సంధ్యా రాణి, కవిత, జ్యోతి, విజయ్ కుమార్, శ్రీనివాస్, రాజమౌళి, స్వామి, వాణి తదితరులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేశారు.

గ్రంథాలయాల సేవలు సద్వినియోగం చేసుకోవాలి

- రాష్ట్ర పౌర గ్రంథాలయాల సంచాలకులు ఏవీఎన్ రాజు

నవతెలంగాణ-గజ్వేల్

గ్రంథాలయాలు అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పౌర గ్రంథాలయాల సంచాలకులు ఏవీఎన్ రాజు అన్నారు. ఆదివారం గజ్వేల్ శాఖ గ్రంథాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో ఉన్న రికార్డులను పరిశీలించారు. అక్కడున్న పుస్తకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు ఎంతమంది పాఠకులు వస్తున్నారని లైబ్రేరియన్ కొన్యాల తిరుపతిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ. ప్రజలకు మెరుగైన సేవలను అందించాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం గ్రంథాలయాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. భవిష్యత్తులో గ్రంథాలయాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు సరికొత్త కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకోసం పలు రకాలైన ప్రణాళికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించడం జరిగిందన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే వాటిని దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ప్రతిరోజు గ్రంథాలయాలకు వచ్చి తమకు కావాల్సిన పుస్తకాలు, గ్రంథాలను పాఠకులు చదువుకునే అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వెంట గజ్వేల్ లైబ్రేరియన్ కొన్యాల తిరుపతిరెడ్డి ఉన్నారు.



మహిళలకు ఇచ్చిన హామీలు ఏమైనట్టు

- మహిళలకు బస్సులు పెంచాలి
- 11వ వార్డు కౌన్సిలర్ చందనా రవీందర్

నవతెలంగాణ-గజ్వేల్



మహిళలకు ఉచిత ప్రయాణం ఏర్పాటు చేసినప్పటికీ గ్రామీణ ప్రాంతాలకు బస్సులు వెళ్లడం లేదని కేవలం పట్టణాలకే పరిమితమైనదని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ 11వ వార్డు కౌన్సిలర్ గంగిశెట్టి చందనా రవీందర్ అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 8 నెలలు గడుస్తున్నా పల్లెలకు బస్సులు పాఠశాలలు ఉంటేనే వెళుతున్నాయని ఆమె పేర్కొన్నారు. అందులో విద్యార్థులు వస్తున్నారని మహిళా ప్రయాణికులకు ఇబ్బందిగా మారిందని ఆమె చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం మరిన్ని బస్సులను పెంచి గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న మహిళలకు కూడా ఈ అవకాశం కల్పించాలని ఆమె కోరారు. అంతేకాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన మహిళలకు రూ 2500 ఇంకా అమలు కావడం లేదని ఆమె పేర్కొన్నారు. ఒక్కొక్కసారి రెండు నెలలు గడిచిన ఒకే పింఛన్ ఇస్తున్నారని ఆమె పేర్కొన్నారు. దీంతో వృద్ధులు, వితంతులు, వికలాంగులు నానా ఇబ్బందులకు గురవుతున్నారని దీనిపై ప్రభుత్వం, అధికారులు దృష్టి సారించాలన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో పెండింగ్లో ఉన్న బస్టాండ్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆమె కోరారు.

ప్రజలకు కేసీఆర్‌పై సంపూర్ణ విశ్వాసం

- బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత బి వి.రావు పంతులు

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ నియోజకవర్గ ప్రజలతో పాటు రాష్ట్రంలో కేసీఆర్‌పై సంపూర్ణ విశ్వాసం ఉందని గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత బి.వి. రావు పంతులు అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గంలో మొత్తం 169 గ్రామపంచాయతీలు ఉండగా వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కైవసం చేసుకుంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ చేసిన అభివృద్ధి ఎంతో పని చేస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భారీ సంఖ్యలో స్థానాలు దక్కించుకుంటామని ఆయన చెప్పారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతంపై దృష్టి పెడతామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలపై దశలవారీగా ఎండగడతామన్నారు.

జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షునిగా తిరుపతి



నవతెలంగాణ-చిన్నకోడూరు

చిన్నకోడూరు మండల జర్నలిస్ట్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా తుమ్మల తిరుపతి(సూర్య), ఉపాధ్యక్షులుగా నిరుగొండ జనార్ధన్(ఆంధ్రప్రభ), ప్రధాన కార్యదర్శిగా పుప్పాల బాలేష్, కార్యదర్శిగా మిట్టపల్లి భరత్, కోశాధికారిగా గాజుల రవి, సలహాదారులుగా మిట్టపల్లి శ్రీనివాస్, బోయిని మధు, కోడి లక్ష్మణ్, గూడ ఇంద్రసేనారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా సుంచు గణేష్, సుంచు మహేష్, గోవిందారపు యాదగిరి, బుచ్చెల్లి రవి, పోతరాజు శంకర్, గొల్లపల్లి మధు, మాతంగి రంగరాజు, గుడిసె ప్రభు తదితరులు ఎన్నికయ్యారు.

వర్షాల కోసం శ్రీరామునికి శ్రీరామ లిఖిత నామాలతో అభిషేకం

నవతెలంగాణ-గజ్వేల్



వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగా పండాలని కోరుతూ శ్రీరామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో అద్దాల మందిరం వద్ద ఆదివారం శ్రీరామునికి శ్రీరామ లిఖిత అమృత నామాలతో సీతారాములకు ప్రత్యేకంగా అభిషేకించి పూజించినట్లు సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజు తెలిపారు. వర్షాలు కురిస్తేనే రైతు ఆనందంగా ఉంటాడని రైతు ఆనందంగా ఉంటేనే ప్రతి ఒక్కరు ఆనందంగా ఉంటారన్నారు. దీని ఆధారంగా వ్యవసాయం ముందుకు సాగుతుందన్నారు. దేశానికి రైతే వెన్నుముఖ అని, అలాంటి రైతు సుఖంగా జీవించకుంటే పరిపాలన కూడా అస్తవ్యస్తంగా మారుతుందన్నారు. అనంతరం భజన కారిక్రమాలు నిర్వహించారు.

గజ్వేల్‌లో పార్టీని బలోపేతం చేయాలి

- ఎంపీ రఘునందన్ రావు

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ నియోజకవర్గంలో బీజేపీని మరింతగా బలోపేతం చేయాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ఆదివారం హైదరాబాదులోని ఆయన క్యాంపు కార్యాలయంలో గజ్వేల్ బీజేపీ నాయకులు కలిసిన సందర్భంలో పై విధంగా అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కార్యకర్తలు నాయకులు బాగా పని చేశారని వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి సత్తాను గజ్వేల్‌లో చూపించాలన్నారు. మండల పరిషత్తులు, మున్సిపాలిటీలను, సర్పంచ్ స్థానాలను, జిల్లా పరిషత్ స్థానాలను కైవసం చేసుకునేందుకు కార్యకర్తలు, నాయకులు కష్టపడాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణానికి చెందిన బిజెపి నాయకులు నాయిని సందీప్ జన్మదిన సందర్భంగా శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బారు అరవిందు తదితరులు ఉన్నారు.

దళిత ఎస్సై శ్రీరాముల శ్రీను మృతి బాధాకరం

- మాల మహానాడు మిరుదొడ్డి మండల యూత్ అధ్యక్షులు పత్తి రాజేందర్

నవతెలంగాణ-మిరుదొడ్డి



భద్రాద్రి జిల్లా అశ్వరావుపేట దళిత ఎస్సై శ్రీరాముల శ్రీను మృతి చాలా బాధాకరమని మాల మహానాడు మిరుదొడ్డి మండల యూత్ అధ్యక్షులు పత్తి రాజేందర్ అన్నారు. తన బాధ్యతలు నిర్వహిస్తుండగా సీఐ జితేందర్ రెడ్డి, కొందరు కానిస్టేబుల్ దళిత ఎస్సైని భయభ్రాంతులకు గురిచేసి ఆయనను చాలా రకాలుగా ఇబ్బంది పెట్టిన సందర్భంగానే ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఉన్నతాధికారులు శ్రీరాముల శ్రీను మృతికి కారణమైన సీఐతో పాటు కానిస్టేబుల్ లను వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, నిందితులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఐ కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా జగ్గారెడ్డి, జయారెడ్డి పుట్టిన రోజు వేడుకలు

నవతెలంగాణ-సంగునూరు



సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాశ్ రెడ్డి అలియాస్ జగ్గారెడ్డి, కూతురు జయారెడ్డిల పుట్టినరోజు వేడుకలు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నంగునూరు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కేకును కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి హాజరై మాట్లాడారు. జగ్గారెడ్డి, జయారెడ్డి ఇలాంటి పుట్టిన రోజు వేడుకలు మరెన్నో జరుపుకొని రాజకీయంగా మరెన్నో అత్యున్నత స్థాయికి ఎదగాలని దేవుణ్ణి ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో సోషల్ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ చెలికాని యాదగిరి యాదవ్, గ్రామ శాఖ అధ్యక్షులు అనరాజు నాగరాజు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు రాగుల కృష్ణ, బీసీ సెల్ మండల అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్, దేవులపల్లి చింటు, దేవులపల్లి శంకరయ్య, జిత్తు బాబు తదితరులు పాల్గొన్నారు.

బాసర ఐఐటికి ఎంపికైన విద్యార్థినికి ఆర్థిక చేయూత

నవతెలంగాణ-కొండపాక



జెడ్పీహెచ్ఎస్ దుద్దెడ పాఠశాలలో చదివి ట్రిబుల్ ఐటీ బాసరకు ఎంపికైన గ్రామానికి చెందిన పబ్బోజు విజయలక్ష్మి-ఆచారీల కూతురు పబ్బోజు రక్షితకు ఆదివారం ఆదర్శ ఫ్రెండ్స్ అసోసియేషన్ రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మిద్దె రమేష్ మాట్లాడుతూ పేదరికాన్ని జయించి ఉన్నతంగా చదివి బాసర ఐఐటీకి ఎంపిక కావడం హర్షించదగిన విషయమని తెలిపారు. అలాగే ఈ విద్యార్థినిని ఆదర్శంగా తీసుకొని మిగతా విద్యార్థులు చదువులో రాణించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బాకి ప్రభాకర్, ఉపాధ్యక్షులు పంజాల శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి మిద్దె శివకుమార్, సభ్యులు మహమ్మద్ మొహినొద్దీన్, నూనె కుమార్ యాదవ్, పెద్దంకుల నరేందర్, గున్నాల శ్రీనివాస్ గౌడ్, పంజాల శ్రీనివాస్ గౌడ్, కాటపాక లింగం, మహమ్మద్ జబ్బర్, మంతూరి నర్సింలు, కొన్నె యాదగిరి, చిలుముల శ్రీరాములు, ఆరేళ్ల ప్రదీప్ లు పాల్గొన్నారు.

వ్యాపార పరంగా అభివృద్ధి చెందుతున్న గజ్వేల్

- మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ పట్టణం వ్యాపారపరంగా అభివృద్ధి చెందుతుందని మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి అన్నారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలో 17వ వార్డు పిడ్ చెడ్ రోడ్ సిగ్నల్ వద్ద ప్రభుత్వ దవాఖాన పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ బాలాజీ లక్ష్మి స్వీట్ హౌస్ బేకరీ షాప్‌ను ప్రారంభించారు. గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి మూలంగా వ్యాపార సంస్థలు గజ్వేల్ పట్టణానికి తరలి వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందని ఉపాధి అవకాశాల కోసం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారు గజ్వేల్‌లో స్థిరపడుతున్నారని అన్నారు. గజ్వేల్ వ్యాపారానికి అనుకూలమైన ప్రాంతం అని, ప్రతి ఒక్కరూ స్వయం ఉపాధి మార్గాలను అన్వేషించి వ్యాపారంలో రాణించాలని, వినియోగ దారుల మన్నన పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ జక్కి ఉద్దీన్, కౌన్సిలర్స్ ఉప్పల మెట్టయ్య, తలకొక్కల భాగ్యలక్ష్మి దుర్గాప్రసాద్, దుంబాల లక్ష్మీ కిషన్ రెడ్డి, ,పట్టణ అధ్యక్షులు నవాజ్ మీరా, ఎస్ సీ సంతోష్, అంబలి శ్రీనివాస్ గుప్త, మర్వాడీ నాయకులు, మాణిక్ లాల్, నర్సింగ్ రామ్, చోలో రామ్, లీలా భారతి, పానలాల్, ప్రేమ్ సోలంకి, కేస రామ్, షాపు యజమాని పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఖజిపూర్ గ్రామంలో హెల్త్ క్యాంప్ ఏర్పాటు



- పడకేసిన పారిశుద్ధ్యం అనే వార్తకు స్పందించిన అధికారులు

నవతెలంగాణ-మిరుదొడ్డి

పడకేసిన పారిశుధ్యం మురికి నీరు మూలంగా ఎక్కడ చెత్త అక్కడే పేర్కుపోయింది ప్రబలుతున్న డెంగ్యూ అంటూ నవ తెలంగాణ లో కథనం ప్రసారం చేయడంతో అధికారులు స్పందించారు. అక్బర్ పేట-భూంపల్లి మండలం కాజిపూర్ గ్రామంలో భూంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేశారు. అనంతరం అల్వాల గ్రామంలో వైద్య సిబ్బంది సహకారంతో గ్రామంలో ఇంటింటా సర్వే చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు .ఎవరికైనా జ్వరాలు వస్తే హెల్త్ క్యాంప్ ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలోని పరిస్థితిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన నవ తెలంగాణ పత్రిక బృందానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

పూలే విగ్రహాల ఏర్పాటుకు భూమి పూజ

నవతెలంగాణ-మద్దూరు



దూళ్మిట్ట మండలంలోని బైరాన్ పల్లి, గ్రామంలోని బురుజు వద్ద బయో డీజిల్ డెవలప్మెంట్ జాతీయ సంస్థ, ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, విగ్రహాల ఏర్పాటు కోసం ఆదివారం భూమి పూజ చేశారు. సందర్భంగా ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు చంద్రశేఖర్, మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో వీరోచితంగా పోరాడి నిజాం రజాకార్లను తరిమికొట్టి వీర మరణం పొందిన. అమరవీరుల స్ఫూర్తితో బహుజనుల ఉద్ధరణకు కృషి చేసిన మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలేల విగ్రహాలను గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. అమరవీరుల సంస్కరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆగస్టు 27న రాష్ట్ర మంత్రి సీతక్క చేతుల మీదుగా విగ్రహాల ఆవిష్కరణ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గంధమాల యాదయ్య మాజీ సర్పంచులు బండి శ్రీనివాస్, ఎడవల్లి చంద్రారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గందె మల్లేశం, కొలిపాక ఉపేందర్, నాగభూషణం, బిక్షపతి, పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-మర్కుక్







మండలంలోని చేబర్తి గ్రామంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం ఎంఆర్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించి ఘనంగా నిర్వహించారు.అనంతరం మందకృష్ణ మాదిగకు 60వ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, మిఠాయిలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఎల్కకంటి కుమార్, చాట్లపల్లి శ్రీరాం, జాలని బలరాం, బొమ్మని మహేష్, చాట్లపల్లి యాదగిరి, బొమ్మని బాలక్రిష్ణ, చాట్లపల్లి రాజశేఖర్, బొమ్మని ప్రభాకర్, అనిల్, ప్రదీప్ తదితరులున్నారు..

నవతెలంగాణ-నంగునూరు

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నంగునూరు మండల కేంద్రంలో మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా సంయుక్త కార్యదర్శి, మండల ఇంచార్జి ఆరెపల్లి కనకయ్య (దస్తగిరి) మాదిగ మాట్లాడుతూ దండోరా ఉద్యమం 1994 జులై ఏడున ప్రారంభమై మాదిగ జాతిని మేల్కొల్పిందన్నారు. ఎమ్మార్పీఎస్ ఏబీసీడీ లక్ష్యంగా ముందుకు సాగుతూ చిన్నచిన్న కులాలకు కూడా ఏకం చేస్తూ ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. పెన్షన్, ఆరోగ్యశ్రీలాంటి కార్యక్రమాలకు ఎమ్మార్పీఎస్ ముందుండి పోరాటం చేసిన చరిత్ర ఉందన్నారు. మాదిగ దండోరా ఉద్యమం అన్ని కులాలకు ఒక దిక్సూచిగా నిలిచిందన్నారు. మాదిగ ఉపకులాల ఐక్యత, జాతి ప్రయోజనాల కోసం ఇంకా ఎన్ని ఉద్యమాలకైనా సిద్ధంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. రాబోయే రోజుల్లో మాదిగలంతా ఏకమై ఏబీసీడీ వర్గీకరణ సాధన కోసం ముందుకు సాగాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మాదిగలంతా మేల్కొని వర్గీకరణ సాధనకు ప్రయాణం కొనసాగించాలని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ 60వ పుట్టిన రోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దేవులపల్లి రాజమౌళి, హరిబాబు,పెర్కని యాదగిరి, ఐలయ్య , దేవులపల్లి బిక్షపతి, దేవులపల్లి యాదగిరి పాల్గొన్నారు.

నవతెలంగాణ-గజ్వేల్

ఎమ్మార్పీఎస్ స్థాపించి మాదిగల ఆత్మ గౌరవాన్ని ప్రపంచవ్యాప్తంగా తన గొంతును ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ వినిపించినట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు మైస రాములు అన్నారు. ఆదివారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవంతో పాటు వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మైసరాములు మాట్లాడుతూ గత వైయస్ ప్రభుత్వంలో లక్ష మంది వికలాంగులకు పెన్షన్ సాధించి పెట్టిన ఉద్యమాన్ని మాదిగ దండోరా ద్వారా మందకృష్ణ మాదిగ సాధించినట్లు ఆయన గుర్తు చేశారు. అదేవిధంగా 30 లక్షల మంది వితంతులకు పెన్షన్, 60 లక్షల పెన్షన్ సాధించినట్లు ఆయన గుర్తు చేశారు. గుండె జబ్బు పిల్లల కోసం ఉద్యమాలు ఆరోగ్యశ్రీతో భద్రత తీసుకొచ్చిన ఉద్యమం మాదిగ దండోరా అని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు యాదగిరి, శ్రీహరి చందు, బలరాం, సుధాకర్, మహేష్, అశోక్, రవి, ప్రభాకర్, సురేందర్, యాదగిరి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రస్థానం ముగిసింది

- భాజపా జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్



నరేంద్ర మోడీ పాలనకు నిదర్శనమే మెదక్ పార్లమెంటు విజయమని సిద్దిపేట జిల్లా భాజపా అధ్యక్షుడు మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణ త్యాగాలు చేసిన త్యాగమూర్తులను బీఆర్ఎస్ విస్మరించిందని, కేసీఆర్‌ను నమ్మి రెండుసార్లు అధికారమిస్తే ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. కుటుంబ పాలన కొనసాగిస్తున్న కేసీఆర్‌ను ప్రజలు తిరస్కరించి 9 పార్లమెంటు స్థానాల్లో ఉన్న బీఆర్ఎస్‌ను జీరోకు తీసుకువచ్చిందన్నారు. భాజపాపై నమ్మకంతోనే మెదక్ పార్లమెంటు ఎన్నికల్లో రఘునందన్ రావును అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున ఓట్లు వేసి గెలిపించారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో సహకరించిన మద్దతు దారులకు న్యాయవాదులకు అన్ని వర్గాల ప్రజలకు కృతజ్ఞతగా ఈ నెల 9న ప్రజ్ఞా గార్డెన్‌లో కృతజ్ఞతా సభ నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు గంగిడి మోహన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మాదాటి జస్వంత్ రెడ్డి, సురేష్ గౌడ్, యెల్లు రాంరెడ్డి, టేకులపల్లి రాంరెడ్డి, గురువా రెడ్డి, వెంకటరమణ, కొన్నే రాజిరెడ్డి, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కూడిక్యాల రాములు, మైనార్టీ నాయకులు ఎండీ ఎక్బల్, బిజెపి పట్టణ, మండలాల అధ్యక్షులు మనోహర్ యాదవ్, అశోక్ గౌడ్, బాల్ రెడ్డి, రాం రెడ్డి, మన్నే శ్రీనివాస్, సంపత్ రెడ్డి, నరేంద్ర చారీ, మహేష్ యాదవ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

మేకు దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రేఖాగౌడ్



నవతెలంగాణ-గజ్వేల్

మేకు దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాలగోని రేఖాగౌడ్‌ను నియమిస్తున్నట్లు రాష్ట్ర గౌడ జన హక్కుల పోరాట సమితి మేకు దెబ్బ నాయకులు జేఏసీ నాయకులు నర్సా గౌడ్ తెలిపారు. ఆదివారం హైదరాబాదులో ఏర్పాటు చేసిన గౌడ జన హక్కుల పోరాట సమితి కార్యక్రమంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన చెప్పారు. తెలంగాణలో గౌడ సంఘం ఇతర సమస్యలపై రేఖాగౌడ్ స్పందించి పోరాటాలు చేసినట్లు ఆయన చెప్పారు. గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్ గ్రామానికి చెందిన రేఖాగౌడ్ నియమించడం పట్ల అందరూ ఏకాభిప్రాయానికి వచ్చారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట, మహబూబాబాద్, కొమురం బీమ్ ఆసిఫాబాద్, మెదక్ జిల్లాల అధ్యక్షులు పచ్చిమడ్ల స్వామి గౌడ్, ముంజాల రాజేందర్ గౌడ్, కొండ్ర మనోహర్ గౌడ్, గొల్లపల్లి సాయగౌడ్,రాష్ట్ర నాయకురాలు మక్తాల శైలజ గౌడ్, రాష్ట్ర నాయకులు కదిరే ఆంజనేయులు గౌడ్, కొయ్యడ శ్రీనివాస్ గౌడ్, మెరుగు క్రిష్ణ గౌడ్, కుంచ సాయి కిరణ్ గౌడ్, ఊరు గొండ శేఖర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో నేడు విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-ములుగు: కొడకండ్ల సబ్ స్టేషన్‌లో మరమత్తుల కారణంగా మండలంలోని పలు గ్రామాలలో సోమవారం ఉదయం 9:00 నుంచి 12:00 గంటలవరకి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఎడిఈ శ్రీనివాస్ తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు అధికారులకు సహకరించగలరు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
సోమవారం | 08 జులై 2024 | www.navatelangana.com

అవి ఫర్టిలిటీలో మొదటిసారి ఐవిఎఫ్

- పిల్లలు లేని దంపతులకు కవల పిల్లలు



నవతెలంగాణ-సిద్దిపేట

అవి ఫర్టిలిటీ సెంటర్ సిద్దిపేటలో మొదటిసారి ఐవిఎఫ్ ద్వారా పిల్లలు లేని దంపతులకు కవల పిల్లలు జన్మించారని డాక్టర్ మైత్రేయి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ఒక బాబు, ఒక పాప జన్మించారని, ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. సిద్దిపేటలో మొదటి సెంటర్, మొదటి ఐవిఎఫ్ ద్వారా పిల్లలు లేని దంపతులకు ఇది ఒక సదవకాశమన్నారు. ఎక్కడికో హైదరాబాద్‌కు పోవాల్సిన అవసరం లేదని, సిద్దిపేటలోని అన్ని రకాల ఆధునాతన సౌకర్యాలతో తమ ఆసుపత్రిలో వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు.

సాగర్ భూ నిర్వాసితుల బాగోగులు తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-ములుగు

ములుగు మండలంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న మామిడియాల, తానేదారిపల్లి, తానేదారి పల్లె తండ, బైలంపూర్ గ్రామాలలో మాజీ శాసనసభ్యులు తూముకుంట నర్సారెడ్డి పర్యటించారు. నిర్వాసితుల బాగోగులు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వారందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆప్షన్ సభ్యుడు సలీం, నియోజకవర్గ యువజన అధ్యక్షులు కడపల కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు తమ్మల శ్రీనివాస్,సీనియర్ నాయకులు గౌరారం నవీన్ లు పాల్గొన్నారు.

పోలీసు శాఖలో కుల వివక్షత సిగ్గుచేటు

- డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి



నవతెలంగాణ-గజ్వేల్

అశ్వరావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్యకు కారకుడైన సీఐ జితేందర్ రెడ్డి, కానిస్టేబుళ్లపై హత్యా నేరంతో పాటు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని దళిత బహుజన ఫ్రంట్ (డిబీఎఫ్)రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి డిమాండ్ చేశారు. ప్రజలందరికి అండగా,ధైర్యంగా ఉండాల్సిన పోలిస్ వ్యవస్థలో కూడా కుల పిశాచి వివిధ రూపాలలో పంజా విసరడం ధారుణమన్నారు. ప్రజా పాలనా ,ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా పోలీసు శాఖలో కుల వివక్షత కనిపించటం సిగ్గుచేటని విమర్శించారు. ఈ కేసును పారదర్శకంగా విచారణ జరిపి బాధ్యులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో దళిత, సామాజిక, కుల, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

సూర్య నమస్కారం ఆరోగ్యానికి ఎంతో మేలు



నవతెలంగాణ-సిద్దిపేట

సూర్య నమస్కారం ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని ప్రముఖ యోగా గురువు, నేషనల్ మెడలిస్టు తోట సతీష్ అన్నారు. వ్యాస మహర్షి యోగా సొసైటీ, సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిద్దిపేట కోమటి చెరువు రూబీ నెక్లెస్‌పై ఆదివారం ఉదయం 108 సామూహిక సూర్య నమస్కారాల సాధన ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కే. అంజయ్య యోగ శిక్షకులు తోట సంధ్య, గంగాపురం శ్రీనివాస్, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు, ఆర్గనైజింగ్ కార్యదర్శి నర్సింలు, పతంజలి యోగ ప్రబారి సురేష్, యోగ అసోసియేషన్ సభ్యులు బసవరాజు కుమార్, వేణు, ఆనంద్, వీరేశం, సాయి తేజ, వనజ, మంజుల, చందన, 70 మంది యోగా సాధకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని మర్కుక్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలో 2009-2010 బ్యాచ్, పదవతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు మండల పరిధిలోని శివారు వెంకటపూర్ గ్రామశివారులో గల వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పాఠశాల దశలో చేసిన చిలిపి చేష్టలు, గత స్మృతులను జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఒక్కరినొక్కరు ఆత్మీయంగా పలకరించుకున్నారు.పూర్వ విద్యార్థులు అందరు కలసి కుటుంబ సభ్యులతో ఫోటోలు దిగారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు,తదితరులున్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు



నవతెలంగాణ-ములుగు

30వ ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ చేసి మందకృష్ణ మాదిగ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యువజన సీనియర్ నాయకులు చింత కింది రాజు, తూర్పుంటి రాజు, అంజి, తోడేటి పెద్ద మహేందర్, ములుగు అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు బుడిగే మహేష్, ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షులు పొట్టి రవీందర్, ఎమ్మార్పీఎస్ మండల సీనియర్ నాయకులు బండమీద నర్సింలు, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు తాడెం చిన్న నరేష్ , తోడేటి చిన్న మహేందర్, కామునికంతల రాజు, కొల్లెల్లి మహేష్, తోడేటి ప్రసాద్, పొట్టి వేణు తదితరులున్నారు

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-వర్గల్

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని చౌదర్ పల్లి గ్రామంలో జరిగింది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం చౌదర్ పల్లి గ్రామానికి చెందిన బండి సాయిలు (65) ఈ నెల 4 వ తేదీ నుంచి కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు బంధువులను, తెలిసిన వారిని విచారించగా ఆచూకీ లభించలేదు. గ్రామంలో అన్ని చోట్ల వేతకగా కనిపించలేదు. ఆదివారం సాయిలు మృతదేహం గ్రామంలోని బందం చెరువులో నీటిపై తేలుతూ కనిపించడంతో కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందజేశారు. సాయిలు మానసిక స్థితి సరిగ్గా లేక చెరువు వద్ద కాలకృత్యాలు తీర్చుకుంటుండగా ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడన్నారు. మృతుడి కుమారుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు గౌరారం ఎస్సై శివకుమార్ తెలిపారు.

జిల్లాకు అథ్లెటిక్స్‌లో రెండు పతకాలు



నవతెలంగాణ-సిద్దిపేట

గచ్చిబౌలిలోని గోపీచంద్ అకాడమీలో రెండవ రాష్ట్రస్థాయి కిడ్స్ చాంపియన్షిప్‌లో జిల్లాకు ఒక వెండి పతకం, ఒక కాంస్య పతకం సాధించారని జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, ప్రధాన కార్యదర్శి కర్రోల్ల వెంకటస్వామి గౌడ్ తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ అండర్ 12లో లాంగ్ జంప్ లో అమృత (సిద్దిపేట మెరీడియన్ పాఠశాల), అండర్ 12 బాలుర విభాగంలో 100 మీటర్స్ పరుగు లో విశ్వ తేజ కాంస్య పతకం సాధించరని తెలిపారు. వీరిని సిద్దిపేట స్పోర్ట్స్ క్లబ్ కన్వీనర్ పాల సాయిరాం, ఎస్ జి ఎఫ్ జిల్లా కార్యదర్శి పణ్యాల రామేశ్వర్ రెడ్డి, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు బండారుపల్లి శ్రీనివాసులు, కామిరెడ్డి రవీందర్ రెడ్డి, ఏరువా అశోక్, కడకంచి ఉప్పలయ్య, దామర మల్లేశం, కనక రెడ్డి, ప్రవీణ్, అక్బర్, ప్రభాకర్, కృష్ణ కుమార్, స్వామి నరేష్, తదితరులు అభినందించారు.

అద్దె భవనాల్లో అంగన్ వాడి కేంద్రాలు

- నెలనెల అద్దె చెల్లించక యజమానులతో ఇబ్బందులు
- భవనాల నిర్మాణం పూర్తి అయ్యేది ఎన్నడు



నవతెలంగాణ-సిద్దిపేట

అంగన్వాడి కేంద్రాలు ప్రజలకు ప్రస్తుత కాలంలో అనేక సదుపాయాలను కల్పిస్తున్న నిలయాలు. కానీ వాటికి పక్క భవనాలు లేక అద్దె భవనాలలో ప్రజలకు సేవలు అందిస్తున్నారు. సిద్దిపేట జిల్లాలో 1150 అంగన్వాడి కేంద్రాలు ఉన్నాయి. వీటి ద్వారా చిన్నారులకు, బాలింతలకు, గర్భిణీలకు పౌష్టికైనా ఆహారం, వ్యాధి నిరోధక టీకాలను, ఆరోగ్య పరీక్షలు, రిఫరల్ సేవలు, ఆరోగ్య విద్య, పూర్వ ప్రాథమిక విద్య సేవలను అందిస్తున్నారు. ప్రస్తుతం 40, 318 మంది చిన్నారులు, 5,518 మంది గర్భిణీలు, 4994 మంది బాలింతలు కేంద్రాల నుండి పౌష్టిక ఆహారాన్ని, ఇతర సేవలను పొందుతున్నారు. కానీ అంగన్వాడిల ద్వారా వచ్చే ప్రభుత్వ సేవలను ప్రజలకు అద్దె భవనాలలో ఉండటం మూలంగా కొంత ఇబ్బందుల మూలంగా అందిస్తున్నారు. పక్కా భవనాలను నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

458 పక్కా భవనాలు

జిల్లాలో 1150 అంగన్వాడి కేంద్రాలు ఉండగా వాటిలో 458 కేంద్రాలకు మాత్రమే పక్కా భవనాలు ఉన్నాయి. 438 కేంద్రాలు వివిధ ప్రభుత్వ పాఠశాలలలో కొన్ని గదులలో నడుస్తున్నాయి. మిగతావన్నీ అద్దె భవనాలలో కొనసాగుతున్నాయి. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా మరో 39 అంగన్ వాడి భవనాల నిర్మాణం వివిధ దశలలో కొనసాగుతున్నాయి. పక్కా భవనాలు లేకపోవడం మూలంగా, అద్దె భవనాల వల్ల ఇంటి యజమానులతో అంగన్వాడి ఉద్యోగులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రతి నెల నెల అద్దె చెల్లించకపోవడం, చిన్నపిల్లల అల్లరితో ఇంటి యజమానుల నుంచి ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ ప్రాంతాలలో అద్దె భవనంలో నడుస్తున్న కేంద్రాలకు రూ 4వేలు, గ్రామాలలో వెయ్యి రూపాయలు చెల్లిస్తున్నట్లు సమాచారం. ఇవి కూడా ప్రతి నెల రాకపోవడం మూలంగా ఇంటి యజమానులతో అంగన్వాడి ఉద్యోగులు మాటలు పడాల్సిన అవసరం వస్తుంది. కేంద్రాలకు వచ్చే చిన్నారులకు, బాలింతలకు, గర్భిణీలకు అద్దె భవనాలు సరిపోవడం లేదు. పట్టణ ప్రాంతాల్లో ఇచ్చే అద్దె కూడా సరిపోవడం లేదు. ప్రభుత్వం ప్రతి గ్రామంలో పక్కా భవనాలు నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఒక్క గదిలోనే అన్ని

పక్క భవనాలు లేకుండా కిరాయి ఇండ్లలో నడిచే అంగన్వాడి కేంద్రాలలో చాలా మట్టుకు ఒకే ఒక గదే ఉన్నాయి. ఆ ఉన్న ఒక గదిలోనే విద్యార్థులకు వంటలు, విద్యా బోధన, కార్యక్రమాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమస్యలన్నీ పరిష్కారానికి పక్కా భవనాల నిర్మాణమే శాశ్వత పరిష్కారం.

సిద్దిపేట జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

- తెలంగాణ ఫుట్బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఫాల్గుణ



నవతెలంగాణ-సిద్దిపేట

క్రీడాకారులు కలిసి కట్టుగా ముందుకు వెళ్లాలని, పదవులు బాధ్యత పెంచుతాయని అల్ ఇండియా ఫుట్బాల్ ఫెడరేషన్ సభ్యులు, తెలంగాణ ఫుట్బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఫాల్గుణ అన్నారు. ఆదివారం సిద్దిపేటలోని గోల్డెన్ బ్యాంక్వెట్ హాల్‌లో సిద్దిపేట ఫుట్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. కార్యక్రమానికి పర్యవేక్షకులుగా, ముఖ్య అతిథిగా అయన పాల్గొన్నారు. సిద్దిపేట జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ అధ్యక్షులు రాంగారి గణేష్, ప్రధాన కార్యదర్శి గా అక్బర్ నవాబ్, ఉపాధ్యక్షులుగా సుగుణకర్ రెడ్డి, హరిశ్ గౌడ్, నగేష్, జాయింట్ సెక్రటర్లుగా రాంగారి నర్సింలు, ట్రేజరర్ గా మాజిద్, ఎక్సక్యూటివ్ మెంబెర్స్ గా లక్ష్మి నారాయణ రెడ్డి, చక్రపాణి గౌడ్, సాజిద్ పాషా, గోవర్ధన్ రెడ్డి, అజర్ పాషాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫుట్బాల్ అసోసియేషన్ నూతన కమిటికి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి ఫుట్బాల్ క్రీడాకారులు వచ్చేలా కృషి చేయాలన్నారు. సిద్దిపేట జిల్లాలో అద్భుతమైన వసతులు ఉన్నాయని, వాటిని సరైన పద్దతిలో వినియోగించుకొని ముందుకు వెళ్లాలన్నారు. అన్ని విధాలుగా మీకు అండగా ఉంటానని అన్నారు. ఈనెల 15 నుండి 29 వరకు సిద్దిపేటలో జాతీయ జూనియర్ గర్ల్స్ ఫుట్బాల్ క్యాంప్ నిర్వహిస్తామని, ఇందులో ఎంపికయినా క్రీడాకారులు కర్ణాటకలోని బెల్గవిలో జరిగే జాతీయ స్థాయి ఫుట్బాల్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. స్పోర్ట్స్ క్లబ్ కన్వీనర్ పాల సాయి రాం మాట్లాడుతూ సిద్దిపేటలో అన్ని క్రీడాకారుల అసోసియేషన్ సభ్యులు కలిసి కట్టుగా ముందుకు వెళ్లాలన్నారు. అనంతరం అతిథులును, నూతన కమిటీని ఘనంగా సన్మానించారు.

ఎస్ఐ ఆత్మహత్యకు కారకుడైన సీఐపై హత్య కేసు నమోదు చేయాలి

- డిబిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు భీమ్ శేఖర్



నవతెలంగాణ-మిరుదొడ్డి

దళిత ఎస్ఐ శ్రీ రాములు ఆత్మహత్యకు కారకుడైన అశ్వారావుపేట సి.ఐ జితేందర్ రెడ్డిపై హత్య నేరం కేసు నమోదు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ జిల్లా ఉపాధ్యక్షులు భీమ్ శేఖర్ డిమాండ్ చేశారు. సీఐ వేధింపులను భరించలేక ఆత్మహత్య యత్నం చేసుకొని సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాగ గాంధీ ఆసుపత్రికి తరలించి పోస్టమార్ట నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ సీఐ వేధింపుల మూలంగానే దళిత ఎస్ఐ ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. సీఐని సస్పెండ్ చేయకుండా కేవలం బదిలీ చేశారన్నారు .మొత్తం సంఘటనపై న్యాయవిచారణ చేసి సీఐని సస్పెండ్ చేసి హత్యానేరం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

గ్రంథాలయాల సేవలు సద్వినియోగం చేసుకోవాలి

- రాష్ట్ర పౌర గ్రంథాలయాల సంచాలకులు ఏవీఎన్ రాజు



నవతెలంగా-ములుగు

గ్రంథాలయాలు అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పౌర గ్రంథాలయాల సంచాలకులు ఏవీఎన్ రాజు అన్నారు. ఆదివారం ములుగు శాఖ గ్రంథాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో ఉన్న రికార్డులను పరిశీలించారు. అక్కడున్న పుస్తకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు ఎంతమంది పాఠకులు వస్తున్నారని లైబ్రేరియన్ సబితను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం గ్రంథాలయాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. భవిష్యత్తులో గ్రంథాలయాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు సరికొత్త కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకోసం పలు రకాలైన ప్రణాళికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించడం జరిగిందన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే వాటిని దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ప్రతిరోజు గ్రంథాలయాలకు వచ్చి తమకు కావాల్సిన పుస్తకాలు, గ్రంథాలను పాఠకులు చదువుకునే అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వెంట ములుగు లైబ్రేరియన్ సబిత ఉన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-రాయపోల్

నిరుపేద కుటుంబానికి మానవత్వంతో ఆర్థిక సహాయం చేశామని చెట్ల నర్సంపల్లి గ్రామ యువకుడు దుబాసి భాస్కర్ అన్నారు. ఆదివారం దౌల్తాబాద్ మండలం చెట్ల నర్సంపల్లి గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన దొడ్డి మల్లేశం కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేద ప్రజలకు చేదోడువాదోడుగా నిలిచి వారి కుటుంబాలకు తోచిన సహాయం చేయాలన్నారు. మల్లేశం కుటుంబం కనీసం నివాసం ఉండడానికి ఇల్లు కూడా లేకపోవడంతో టార్పాలిన్ కవర్‌తో వేసుకున్న గుడిసెలో నివాసం ఉంటున్నారన్నారు. మానవత్వంతో రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పసి నర్సింలు, కనకరాజు, మల్లేశం, లింగం, రమేష్ ,ప్రభాకర్, శ్రీను, కనకరాజు, యాదగిరి పాల్గొన్నారు.

అవినీతి ముందు నిజాయితీ ఓడిపోయింది



నవతెలంగాణ-సిద్దిపేట

అశ్వారావుపేట ఎస్సై శ్రీనివాస్ మృతికి కారణమైన నిందితులను వెంటనే శిక్షించాలని డిఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కుంభల రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం దళిత సంఘర్షణ సమితి, బహుజన ప్రజాస్వామ్య విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో దళిత సంఘర్షణ సమితి సిద్దిపేట జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ఎస్సైగా పనిచేస్తున్న శ్రీరాముల శ్రీనివాసులు ను మానసికంగా ఇబ్బందులకు గురి చేసిన సీఐ జితేందర్ రెడ్డి, కానిస్టేబుల్ సన్యాసినాయుడు, సుభాని, శేఖర్, శివ నాగరాజుపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక దళిత కుటుంబానికి చెందినటువంటి ఎస్ఐ శ్రీనివాసు సీఐ అనేక రకాలుగా ఇబ్బందులు పెట్టడంతో తను బాధ భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడని, హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారని అన్నారు. మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిడిఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దెబ్బేట ఆనంద్, డిఎస్ ఎస్ పట్టణ అధ్యక్షులు ఎండి రజాక్, బిఎఫ్‌టియు జిల్లా కన్వీనర్ శివరాత్రి శ్రీనివాస్, టౌన్ సహాయ కార్యదర్శి గుండబోయిన సతీష్, బిడిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు షడిమెల డేవిడ్, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేసి బీజేపీ తన చిత్తశుద్ధిని చాటుకోవాలి



నవతెలంగాణ-చేర్యాల

ఎస్సి వర్గీకరణ చేసి బీజేపీ తన చిత్తశుద్ధిని చాటుకోవాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు భూమిగారి రాజేందర్ అన్నారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో ఆదివారం తలపెట్టిన మహా దీక్షకు మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, జెండా ఆవిష్కరించి తరలివెళ్లారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి నేటికి 30 సంవత్సరాలు గడుస్తున్నా ఎస్సీ వర్గీకరణ చేయకపోవడం బాధాకరమని, బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత వంద రోజుల్లో ఏబిసిడి వర్గీకరణ చేస్తామని మాట ఇచ్చి సంవత్సరాలు గడుస్తున్నా వర్గీకరణ చేయకపోవడం వారి కపట బుద్ధికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో మల్లిగారి శ్రీనివాస్, మల్లిగారి బాబు, నరేష్, గణేష్,ఏలూరి కృష్ణ, ఏలూరి రాజయ్య, రామగల్ల నాగరాజు, చుంచు, తిరుపతి, విజయ్, బాబు, లోకేష్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సమస్యలు తట్టుకోలేక వ్యక్తి ఆత్మహత్య



నవతెలంగాణ-మిరుదొడ్డి

కుటుంబ సమస్యలు తట్టుకోలేక వ్యక్తి మృతి చెందిన ఘటన మిరుదొడ్డి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మిరుదొడ్డి గ్రామానికి చెందిన ధర్మారం కనకయ్య(55) కు ఇద్దరు పిల్లలు కుమారుడు రాజు కూతురు దీపికలు ఉన్నారు. అందులో కూతురు వివాహమై రెండు నెలల క్రితం ఆమెకు ఆమె భర్తతో విభేదాలు రావడం వలన విడాకులు తీసుకున్నారు. .కూతురుకి విడాకులైన విషయంతోపాటు కుటుంబ సమస్యలు ఎక్కువ కావడంతో మనోవేదనకు గురై మానసికంగా కృంగిపోయిన కనకయ్య ఇంటి నుంచి బయటకు వెళ్లి మిరుదొడ్డి గ్రామంలోని ఎస్సీ హాస్టల్ వెనుక గల ఒక గొర్ల కొట్టంలో తాడుతో ఉరివేసుకొని మృతి చెందాడు ఇట్టి విషయాన్ని తెలుసుకున్న మిరుదొడ్డి ఎస్ఐ పరశురాములు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మట్టి స్నానంలో మహా ఆరోగ్యం



నవతెలంగాణ-సిద్దిపేట

మట్టి స్థానంలో మహా ఆరోగ్యం అని ఆచార్యులు యోగా వంశీకృష్ణ అన్నారు. అది యోగి పరమేశ్వర యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సిద్దిపేట వయోలా గార్డెన్‌లో యోగా గురువులు బొజ్జ అశోక్, ఎలిగేటి కృష్ణమూర్తి, పెద్ది మనోహార్ ఆధ్వర్యంలో మట్టి స్నానం కార్యక్రమం నిర్వహించారు. మొదట కార్యక్రమానికి హాజరైన వారితో సూక్ష్మ యోగా ఆసనాల సాధన చేయిస్తూ ఉపయోగాలను వివరించారు. మట్టి స్నానం వలన కలిగే ఉపయోగాలను బోధించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన వారితో మట్టి స్నానం చేయించారు. అది యోగి పరమేశ్వర యోగ ఫౌండేషన్ వ్యవస్థాపకుల సిద్ది రాములు, తుల్జపూర్ వినోద్ లు ప్రతి నెల నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు, మట్టి స్నానం నిపుణులు గురూజీ శ్రీనివాస్, ప్రభుదాస్, కడవేర్గు రమేశ్ బాబు, కత్తుల బాపురెడ్డి, జూలూరి రవికుమార్, దేవేందర్ గౌడ్, సముద్రాల శ్రీనివాస్, చింతల శ్రీనివాస్, రామచంద్రారెడ్డి, రామచంద్రం, కూతురు రాజిరెడ్డి, శ్రీనివాస చారి, నాయిని సంజీవరెడ్డి, శ్రీహరి, శ్రీనివాస్ రెడ్డి, చంద్రం, రాము, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు యహశ్విన్‌రే రాజు ఎంపిక



నవతెలంగాణ-సిద్దిపేట

50వ జూనియర్ జాతీయస్థాయి అక్వేటిక్ వాటర్ పోలో ఛాంపియన్షిప్ 2024కు సిద్దిపేట పట్టణానికి చెందిన పచ్చి మడ్ల యహశ్విన్ రే రాజు ఎంపికయ్యాడని జిల్లా సిమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షులు బర్ల మల్లికార్జున్, ప్రదాన కార్యదర్శి గుండి ప్రవీణ్ లు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ సికింద్రాబాద్‌లోని ఎం సి హెచ్ స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎంపికలో ఉత్తమ ప్రతిభ కనబరిచి, జాతీయస్థాయి వాటర్ పోలో ఛాంపియన్షిప్ కు ఎంపికైనట్లు తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగే జాతీయస్థాయి క్రీడలలో పాల్గొంటాడని తెలిపారు. స్విమ్మింగ్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమేష్, స్పోర్ట్స్ క్లబ్ కన్వీనర్ పాల సాయిరాం, ఎజిఎఫ్ కార్యదర్శి రామేశ్వర్ రెడ్డి, వాలీబాల్ సెక్రెటరీ రవీందర్ రెడ్డి, అథ్లెటిక్స్ వెంకటస్వామి, ఫుట్బాల్ అక్బర్, బ్యాడ్మింటన్ బాలరాజు, థైక్వాండో శ్రీనివాస్, క్రికెట్ కోచ్ మధు, అథ్లెటిక్స్ సీనియర్ కోచ్ ప్రభాకర్, వ్యాయామ ఉపాధ్యాయులు, స్విమ్మింగ్ అసోసియేషన్ సభ్యులు అభినందనలు తెలిపారు.

స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోండి

- మున్సిపల్ చైర్మన్ రాజమౌళి



నవతెలంగాణ-గజ్వేల్

ఉపాధి అవకాశాలను చిన్న పరిశ్రమల ద్వారా ఉపాధి పొందాలని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి అన్నారు. ఆదివారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పోలీస్ స్టేషన్ రోడ్డులోని మహతి ఆడిటోరియం పక్కన శ్రీ కనకదుర్గ హెూం మేడ్. షాపును యజమాన్యం రాజుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఉద్యోగాలు అందరికీ రావని స్వయం ఉపాధి ఎంతో ఉపయోగమన్నారు. వినియోగదారులు కోరుకునే విధంగా అన్ని రకాల పిండి పదార్థాలు నాణ్యమైన పిండితో పదార్థాలను తయారు చేసి విక్రయించడం అభినందనీయమని వినియోగదారుల నమ్మకాన్ని నిజం చేయాలని నిర్వాహకులను చైర్మన్ కోరారు. కేవలం ఆంధ్ర పట్టణాలలోని ఇలాంటి విక్రయ కేంద్రాలు ఉండగా నేడు మన గజ్వేల్ పట్టణంలో ఏర్పాటు చేసి ఉపాధి పొందడమే కాకుండా వీరితో పాటు మరో నలుగురికి ఉపాధి కల్పించడం పట్ల కనకదుర్గ హెూం మేడ్ నిర్వాహకులను చైర్మన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ ఉప్పల మెట్టయ్య, భాగ్యలక్ష్మీ దుర్గ ప్రసాద్, నాయకులు ఏం సి సంతోష్, సాయి, వినోద్, మహేందర్, ఉన్నారు.

విశిష్ట ప్రతిభా పురస్కారం అందుకున్న రాజలింగం



నవతెలంగాణ-సిద్దిపేట

శాలివాహన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ శ్రీ వరకవి సిద్దప్ప జయంతి సందర్భంగా హైదరబాద్ లోని డా. నందమూరి తారకరామారావు కళామందిరం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో విశిష్ట ప్రతిభా పురస్కారం-2024ను సిద్దిపేటకు చెందిన ప్రముఖ న్యాయవాది రాజలింగం ఆదివారం అందుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతిభా పురస్కారం అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. పలువురు ఆయనను అభినందించారు.